గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక
రిపోర్టర్స్ కావలెను.
9441735522
9849440951
అనతి కాలంలోనే విశేష ప్రజాదరణ పొందుతున్న గౌతమ్ న్యూస్ తెలుగు దినపత్రికకు మరియు Gtv లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు ,ఆర్ సి ఇంఛార్జీలు, మండల విలేకరులు కావలెను.

# గౌతమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక

ప్రతి క్షణం ప్రజల కోసం...
24 X 7
GAUTHAM NEWS
Voice of Truth...
GAUTHAM NEWS TV

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 238, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1, ఆదివారం - 06 - అక్టోబర్ - 2024
PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## 27 ఏళ్ల తర్వాత ఇరానీ కప్ గెలిచిన ముంబయి

లక్నో వేదికగా ముంబయి, రెస్టాఫ్ ఇండియా మ్యాచ్
మ్యాచ్ డ్రా కావడంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విజేతగా ముంబయి
ఓవరాల్‌గా ఇరానీ ట్రోఫీని 15 సార్లు గెలిచిన ముంబయి జట్టు
సర్ఫరాజ్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు



2

## ఇరాన్ అణ్వాయుధ ప్లాంట్ లను ముందు ధ్వంసం చేయండి.. ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచన

మిగతా లక్ష్యాల సంగతి తర్వాత చూసుకోవచ్చన్న మాజీ ప్రెసిడెంట్
నార్త్ కరోలినాలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో వ్యాఖ్యలు
ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై దాడిని సమర్థించబోతున్న అమెరికా ప్రెసిడెంట్ బైడెన్



2

## తెలుగు రాష్ట్రాలకు బిగ్ అలర్ట్.. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

తెలుగు రాష్ట్రాల్లో ఎండ తాకిడి భారీగా
ఆటు ఏపీ, ఇటు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది



# మనకి ఆ బాధ్యత లేదా..? : సీఎం రేవంత్ సూటి ప్రశ్న

20 ఏళ్లు ప్రతిపక్షంలో ఉన్న తనకి పేదల బాధ ఎలా ఉంటుందో తెలుసని సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ మురికితో మూసీ నిండిపోయి ఆ విషవాయువులు నల్గొండ ప్రజలకు విషంగా మారుతోంది

నల్గొండని ఆదుకోవాల్సిన బాధ్యత కూడా మనదే కదా

కేవలం ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన తప్ప వేరే ఆలోచనే లేదు" అని సీఎం



హైదరాబాద్ : పేదోడి బాధ ఎలా ఉంటదో తనకి తెలుసని, జీవి తాంతం కష్టపడి కట్టుకున్న ఇల్లు కూలిపోతే వాళ్ల బాధ ఎలా ఉంటుందో తాను అర్థం చేసుకోగలనని, 20 ఏళ్లు ప్రతిపక్షంలో ఉన్న తనకి పేదల బాధ ఎలా ఉంటుందో తెలుసని మిగతా..2లో

## రేవంత్ ను టార్గెట్ చేస్తూ.. కేటీఆర్ భారీ ట్వీట్



2లో

- మూసీ వెనక దాక్కున్న ముసుగు దొంగ ఎవరని ప్రశ్నించిన కేటీఆర్
- రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరని ప్రశ్న
- పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? అని విమర్శ

## ఇది నా విజయమో, వైసీపీ విజయమో అనుకోవడంలేదు



2

తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు

స్వతంత్ర సిట్ ఏర్పాటుకు ఆదేశాలు

న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్న వైవీ సుబ్బారెడ్డి

అమరావతి : తిరుమల లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించడంపై మిగతా..2లో

## తిరుమలకు పూర్వవైభవం తేవాలి.. అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష



- పద్మావతి అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశానికి మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో, అదనపు ఈవో సహా ఇతర అధికారులు హాజరయ్యారు
- ఈ సమీక్షలో చంద్రబాబు అధికారులకు కీలక సూచనలు చేశారు
- ప్రశాతంతకు ఎక్కడా భంగం కలగకూడదని, ఏ విషయంలోనూ రాజీ పడొద్దని, తిరుమలకు పూర్వ వైభవం తేవాలని సూచించారు



2లో

## 'మెట్రో' ఉచిత పార్కింగ్ కల్పించాల్సిందే.. యువజన సంఘాల డిమాండ్

ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కొనసాగించాలని ఎండీకి యువజన సంఘాలు డిమాండ్

మెట్రో ప్రయాణికులు సంయుక్తంగా నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద నిరసన

దీనిపై సంస్థ సానుకూల నిర్ణయం తీసుకోకపోతే యువజన సంఘాలు ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు

## రేవంత్‌రెడ్డి చేసేది ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ



ఫోర్ బ్రదర్స్ సిటీ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు

కందుకూరు వద్ద నిర్వహించి రైతు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు

రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు

ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటూ దొంగ నాటకాలు ఆడుతున్నారని కామెంట్

హైదరాబాద్ : : ముచ్చర్ల కేంద్రంగా సీఎం రేవంత్‌రెడ్డి చేసేది ఫోర్త్ సిటీ కాదని.. ఫోర్ బ్రదర్స్ సిటీ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇవాళ ఆయన మహేశ్వరం మిగతా..2లో

## మీ ఆస్తులేమీ ఇవ్వొద్దు కానీ... మీ అనుభవాన్ని పేదల కోసం ఉపయోగించండి



2లో

- మూసీ ప్రక్షాళన చేపట్టిన రేవంత్ ప్రభుత్వం
- మూసీ నిర్వాసితులకు కాంగ్రెస్ సర్కారు అండగా ఉంటుందన్న సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ బఫర్ జోన్ లో ఉన్నవాళ్లు ఆందోళన చెందవద్దని సూచన
- సూచనలు, సలహాలు ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలకు విజ్ఞప్తి

## తిరుమలలో రూ.13.40 కోట్లతో వకుళమాత వంటశాల... ప్రారంభించిన సీఎం చంద్రబాబు

వకుళమాత వంటశాల ద్వారా రోజుకు 1.25 లక్షల మందికి ఆహారం

తిరుమలలో ప్రక్షాళన ప్రారంభించామన్న చంద్రబాబు

భక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా సేవలు అందిస్తామని వెల్లడి

అమరావతి : తిరుమలలో రూ.13.40 కోట్లతో నిర్మించిన వకుళామాత వంటశాలను సీఎం చంద్రబాబు నేడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వకుళమాత కేంద్రీయ వంటశాలను ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. రోజుకు 1.25 లక్షల మందికి





అన్నప్రసాదాన్ని ఈ వంటశాల ద్వారా అందించవచ్చని వెల్లడించారు. 18 వేల మందికి అరగంటలో ఒక రకం వంటకాన్ని ఈ కిచెన్ ద్వారా అందించవచ్చని తెలిపారు. తరిగొండ వెంగమాంబ, అక్షయ, వకుళమాత వంటశాలలతో రోజుకు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందించవచ్చని... శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవల ఒదించేలా ఆధునిక కిచెన్ లు ఏర్పాటు చేశామని చంద్రబాబు

**తరిగొండ వెంగమాంబ, అక్షయ, వకుళమాత వంటశాలలతో రోజుకు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందించవచ్చని... శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేలా ఆధునిక కిచెన్ లు ఏర్పాటు చేశామని చంద్రబాబు చెప్పారు. "ఎన్టీఆర్ హయాంలో అన్నదానం ప్రారంభమైంది... ఏ ప్రాంతంలో లేని విధంగా ఒక దేవుడి సన్నిధిలో అన్నదానం జరుగుతోంది. నాడు రెండు, మూడు వేల మందితో ప్రారంభమై నేడు 3 లక్షల మందికి అన్నదానం జరుగుతోంది**

## డిప్యూటీ సీఎంల మధ్య సనాతన వార్.. చిరును ట్యాగ్ చేస్తూ అనుచరుల పోస్టులు!



- వారాహి డిక్లరేషన్ సభలో సనాతన ధర్మంపై పవన్ కీలక వ్యాఖ్యలు
- ఆ వ్యాఖ్యలతో పరోక్షంగా ఉదయనిధి స్టాలిన్‌కు హెచ్చరిక
- గతంలో సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ వివాదాస్పద వ్యాఖ్యలు
- సోదరుడి ఎమోషన్స్‌ను కంట్రోల్ చేసుకోమని చెప్పండి అంటూ చిరును మధ్యలోకి లాగిన స్టాలిన్ అనుచరులు

## 27 ఏళ్ల తర్వాత ఇరానీ కప్ గెలిచిన ముంబయి

న్యూఢిల్లీ : ముంబయి జట్టు ఇరానీ కప్ విజేతగా నిలిచింది. రెస్టాఫ్ ఇండియాతో జరిగిన మ్యాచ్ డ్రా కావడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం ఆధారంగా ముంబయి విజేతగా అవతరించింది. దీంతో 27 ఏళ్ల తర్వాత ఆ జట్టు ఈ ట్రోఫీని సాధించినట్లైంది. ఇక ఓవరాల్‌గా ముంబయి జట్టు ఇరానీ ట్రోఫీని 15 సార్లు గెలిచింది. మ్యాచ్ విషయానికి వస్తే... తొలి ఇన్నింగ్స్‌లో ముంబయి 537 పరుగుల భారీ స్కోర్ చేసింది. ముంబయి బ్యాటర్లలో సర్ఫరాజ్ ఖాన్ అజేయ ద్విశతకం (222 నాటౌట్) సాధించగా.. కెప్టెన్ అజింక్య రహానే (97) త్రుటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. మరో బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ అర్ధ శతకం (57)తో రాణించాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన రెస్టాఫ్ ఇండియా 416 పరుగులకు ఆలౌట్ అయింది. అభిమన్యు ఈశ్వరన్ భారీ శతకం (191) సాధించగా, ధ్రువ్ జురెల్ (93)కు కొద్దిలో సెంచరీ చేజారింది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ముంబయి జట్టు ఆఖరిదైన ఐదో రోజు 8 వికెట్లకు 329 పరుగులు చేసింది. ఆ జట్టులో తనుష్ కొటియన్ అజేయ శతకం (114 నాటౌట్) చేయగా, పృథ్వీ షా (76), మోహిత్ (51 నాటౌట్) అర్ధ శతకాలతో రాణించారు. అయితే, మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో డ్రాగా ముగిస్తున్నట్లు ప్రకటించారు. డబుల్ సెంచరీతో మెరిసిన ముంబయి ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

## ఇరాన్ అణ్వాయుధ ప్లాంట్ లను ముందు ధ్వంసం చేయండి.. ఇజ్రాయెల్ కు ట్రంప్ సూచన

న్యూఢిల్లీ, : ఇజ్రాయెల్ ప్రతీకార దాడులలో హిజ్బుల్లా, హమాస్ సంస్థలకు చెందిన కీలక నేతలు చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఇరాన్ స్పందించి ఇజ్రాయెల్ పైకి మిసైళ్ల వర్షం కురిపించింది. దాదాపు 200 మిసైళ్లను ప్రయోగించి హెచ్చరికలు పంపింది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇరాన్ దాడిపై ప్రస్తుతం ఇజ్రాయెల్ మౌనంగా ఉన్నప్పటికీ ప్రతీకార దాడులు తప్పకుండా చేస్తుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అమెరికా మాజీ ప్రెసిడెంట్, ప్రస్తుతం మరోసారి పోటీ పడుతున్న రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఇరాన్ పై ప్రతీకార దాడుల విషయంలో ఇజ్రాయెల్ కు కీలక సూచన చేశారు. ప్రతీకార దాడులను ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలతో మొదలు పెట్టాలని ట్రంప్ సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రపంచం అంతటికీ అణ్వాయుధాలతోనే ముప్పు పొంచి ఉందని గుర్తుచేశారు. అందుకే ముందుగా ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేయాలని, ఆపై మిగతా టార్గెట్లపై దృష్టి సారించవచ్చని పేర్కొన్నారు. ఈ విషయంలో అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ స్పందన సరికాదని విమర్శించారు. ఇటీవల మీడియా అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ ప్రెసిడెంట్ బైడెన్.. ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడులు చేయాలన్న ఆలోచనను తాను సమర్థించబోనని చెప్పారు. దీనిని ట్రంప్ తప్పుబట్టారు.. ప్రపంచానికి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ముందు అణుకేంద్రాలపైనే దాడి చేయాలని ఇజ్రాయెల్ కు సూచించారు.

## తెలుగు రాష్ట్రాలకు బిగ్ అలర్ట్.. నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

హైదరాబాద్ : గత రెండు రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో ఎండ తాకిడి భారీగా పెరిగిపోయింది. దీంతో పల్లెలు, పట్టణ ప్రాంతాల్లో ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకాశంలో మేఘాలు ఉన్నప్పటికి వర్షాలు మాత్రం ఎక్కడో ఒక చోట మాత్రమే కురుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాలకు అలర్ట్ జారీ చేసింది. బంగాళాఖాతంలో ఈ రోజు ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆటు ఏపీ, ఇటు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ అల్పపీడనం కారణంగా రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, అలాగే పలు జిల్లాల్లో మోస్తారు వర్షాలు కురుస్తాయని అలర్ట్ జార్ట్ రీ అయింది. దీంతో పాటు.. తెలంగాణలోనూ రానున్న 4 రోజుల్లో మోస్తారు వర్షాలు కురిసే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇదిలా ఉండే శుక్రవారం సాయంత్రం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా.. వరద కారణంగా కీలక మార్గాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.


## మీ ఆస్తులేమీ ఇవ్వొద్దు కానీ... మీ అనుభవాన్ని పేదల కోసం ఉపయోగించండి

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చెరువుల ఆక్రమణలు, మూసీ నది పరీవాహక ప్రాంతంలో ప్రక్షాళనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో దృష్టిసారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో, మూసీ పరీవాహక ప్రాంతంలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న వారు, ఇప్పుడు తమ ఇళ్లను కోల్పోనున్నారు. వారిలో నెలకొన్న ఆందోళనలను తొలగించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మూసీ బఫర్ జోన్ లో ఉన్నవాళ్లు ఆందోళన చెందవద్దని సూచించారు. మూసీ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వరదల నుంచి రక్షించేందుకే మూసీ ప్రక్షాళన చేపడుతున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితులకు రూ.10 వేల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. "పాలనలో తమకు పదేళ్ల అనుభవం ఉందని బీఆర్ఎస్ పార్టీ చెప్పుకుంటోంది. మీ ఆస్తులేమీ ఇవ్వొద్దు కానీ, మీ అనుభవాన్ని పేదల కోసం ఉపయోగించండి... రండి, అందరం కూర్చుని మాట్లాడుదాం... పేదల కోసం ఏం చేయగలమో చర్చిద్దాం. జీవితాంతం కష్టపడిన సొమ్ముతో కొనుక్కున్న ఆస్తి కోల్పోతే పేదలకు తప్పకుండా దుఃఖం ఉంటుంది... ఆ విషయం నాకు తెలియదా? భూమి బద్దలై చచ్చిపోతే బాగుండు అనేంతగా పేదలకు బాధ ఉంటుంది. 20 ఏళ్లుగా ప్రతిపక్షంలో ఉన్నాను... పేదల బాధ ఎలా ఉంటుందో తెలియకుండానే ఇంత దూరం వచ్చానా? ఇప్పుడు ఫాంహౌస్ లను కాపాడు కు నేందుకు పేదలను రెచ్చ గొడుతున్నారు. పేదలను రెచ్చగొట్టడం కాదు... ఆక్రమణలపై ఏం చేద్దామో సూటిగా చెప్పండి" అంటూ బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ. 1,500 కోట్లు ఉన్నాయని, బీఆర్ఎస్ చేసిన దోపిడీలో 10 శాతం తిరిగి ఇచ్చినా పేదలు బాగుపడతారని పేర్కొన్నారు.

## డిప్యూటీ సీఎంల మధ్య సనాతన వార్.. చిరును ట్యాగ్ చేస్తూ అనుచరుల పోస్టులు!

అమరావతి : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ మధ్య సనాతన ధర్మం వివాదం ముదురుతోంది. గురువారం నాడు తిరుపతిలో వారాహి డిక్లరేషన్ సభలో జనసేనాని పవన్ కల్యాణ్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ఉదయనిధి స్టాలిన్‌ను హెచ్చరించినట్లైంది. గతంలో ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, సనాతన ధర్మం వైరస్ లాంటిదని దాన్ని నాశనం చేయాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా పెద్ద చర్చ జరిగింది కూడా. ఆ వ్యాఖ్యలను తిరుపతిలో పవన్ కల్యాణ్ గుర్తు చేస్తూ... సనాతన ధర్మం ఒక వైరస్ దాన్ని నాశనం చేస్తానని ఒక యువనేత అంటున్నాడు. నీలాంటోళ్లు చాలామంది వచ్చారు. చరిత్రలో కలిసి పోయారని వ్యాఖ్యానించడం వివాదాస్పదంగా మారింది. ఇక శుక్రవారం నాడు ఉదయనిధి స్టాలిన్‌ను పవన్ వ్యాఖ్యలపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా వేచిచూద్దాం ఏం జరుగుతుందో అని చెప్పి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. జనసేనాని లక్ష్యంగా డీఎంకే పార్టీ సోషల్ మీడియా వింగ్ పాత వీడియోలను పోస్ట్ చేస్తూ ట్రోలింగ్ చేస్తోంది. దీనిపై పవన్‌కు మద్దతుగా జనసేన, బీజేపీ వింగ్స్ కౌంటర్ ఇస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పుడు ఉదయనిధి అనుచరులు ఈ వివాదంలోకి మెగాస్టార్ చిరంజీవిని లాగుతున్నారు. మీ సోదరుడిని ఎమోషన్స్‌ను కంట్రోల్ చేసుకోమని చెప్పండి అంటూ చిరును ట్యాగ్ చేస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారు. ఈ పోస్టులకు సీఎం స్టాలిన్‌తో చిరంజీవి దిగిన ఫొటోలను జోడిస్తున్నారు. మరోవైపు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తమిళనాడులోని మదురైలో కేసు నమోదైన విషయం తెలిసిందే. మతాలను రెచ్చగొట్టేలా పవన్ వ్యాఖ్యానించారంటూ మదురై న్యాయవాది ఒకరు తాజాగా కేసు పెట్టారు.

## రేవంత్ ను టార్గెట్ చేస్తూ.. కేటీఆర్ భారీ ట్వీట్



హైదరాబాద్ : రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతు రుణమాఫీని ఎగ్గొట్టిన ప్రభుత్వం... మూసీలో మురికి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ... రైతులను మోసం చేస్తోందని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా విమర్శలు ఎక్కుపెట్టారు. "మూసీ వెనక దాక్కున్న ముసుగు దొంగ ఎవరు? రైతు రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు చేస్తున్న మురికి దొంగ ఎవరు? రైతు బంధు ఎగ్గొట్టి, మూసీ పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు? మహిళలకు వంద రోజుల్లోనే నెలకు 2,500 ఇస్తా అని చెప్పి తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు? అవ్వ, తాతలకు నెలకు 4,000 ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు? ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తా అని మాట తప్పిన దగావీరుడు ఎవరు? మూసీ బ్యూటిఫికేషన్ పేరిట రూ. 1,500,000,000 కోట్ల లూటిఫికేషన్ కి తెరతీసిన ఘనుడు ఎవరు? బతుకమ్మ అంటే గిట్టదా.. పట్టదా ఈ ముఖ్యమంత్రికి? ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురావట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా వుంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన అక్కా చెల్లెళ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? బ్లీచింగ్ పౌడర్ కొనడానికి.. చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పైసల్లేని పరిస్థితులు దాపురించాయి పంచాయతీల్లో! రాష్ట్ర పండుగను నిర్వహించుకునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది? తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం? ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను.. స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు? బతుకమ్మ చీరలను రద్దు చేసారు. ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## తిరుమలలో రూ.13.40 కోట్లతో వకుళమాత వంటశాల... ప్రారంభించిన సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి




అనంతరం ఆయన మాట్లాడుతూ, వకుళమాత కేంద్రీయ వంటశాలను ప్రారంభించడం ఆనందంగా ఉందని తెలిపారు. రోజుకు 1.25 లక్షల మందికి అన్నప్రసాదాన్ని ఈ వంటశాల ద్వారా అందించవచ్చని వెల్లడించారు. 18 వేల మందికి అరగంటలో ఒక రకం వంటకాన్ని ఈ కిచెన్ ద్వారా అందించవచ్చని తెలిపారు. తరిగొండ వెంగమాంబ, అక్షయ, వకుళమాత వంటశాలలతో రోజుకు 3 లక్షల మందికి అన్నప్రసాదం అందించవచ్చని... శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవల ఒదించేలా ఆధునిక కిచెన్ లు ఏర్పాటు చేశామని చంద్రబాబు చెప్పారు. "ఎన్టీఆర్ హయాంలో అన్నదానం ప్రారంభమైంది... ఏ ప్రాంతంలో లేని విధంగా ఒక దేవుడి సన్నిధిలో అన్నదానం జరుగుతోంది. నాడు రెండు, మూడు వేల మందితో ప్రారంభమై నేడు 3 లక్షల మందికి అన్నదానం జరుగుతోంది. అన్నదానం, ప్రాణదానం కార్యక్రమాలను మరింత క్రమబద్ధీకరణ చేస్తాం. క్యూ లైన్ల నిర్వహణను కూడా రిగా చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. పరిశుభ్రత, ప్రసాదం నాణ్యత, మేనేజ్ మెంట్ లో కూడా మార్పు వచ్చింది. దీంతో భక్తులు హర్షిస్తున్నారు" అని సీఎం అన్నారు.

భక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా సేవలు

టీటీడీలో ప్రక్షాళన ప్రారంభించాం... రాబోయే రోజుల్లో భక్తుల నుండి అభిప్రాయం తీసుకుంటాం. ఇక్కడ అటవీపరంగా జీవ వైవిధ్యానికి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రశాంత వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం. తిరుమల ఎప్పుడూ భక్తులకు దివ్య క్షేత్రంగా ఉంటుంది. భక్తల మనోభావాలకు, సాంప్రదాయాలకు అనుగుణంగా తిరుమలలో ప్రసాదం ఉంటుంది. శ్రీవారి సేవకులకు కూడా కెపాసిటీ బిల్డింగ్ చేస్తాం. తిరుమలలో మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తాం. దివ్యక్షేత్రం పవిత్రతకు భంగం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నుండి టీటీడీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. లడ్డు ప్రసాదంతో పాటు, అన్నప్రసాదం, ఇతర ప్రసాదాల్లో రాబోయే రోజుల్లో పరీక్షలు ఉంటాయి. నేను నిద్ర లేచిన సమయంలోనైనా, నాకు కష్టం వచ్చిన ప్రతిసారి వెంకటేశ్వర స్వామిని తలచుకుంటాను. తిరుమల కొండపై పని చేసేవారు, కొండకు వచ్చేవారు పవిత్రంగా ఉండాలి. ప్రపంచంలో ఉండే హిందువుల మనోభావాలకు ఈ తిరుమల కేంద్ర బిందువు... ఆ ఎకో సిస్టం కాపాడతాం.

ఆ విషయంలో రాజీ పడేది లేదు

శ్రీవారి ప్రసాదాల నాణ్యతలో రాజీపడం. గతంలో ప్రసాదం బాగోలేదని చాలాసార్లు భక్తులు ఆందోళన చేస్తే నాటి పాలకులు పట్టించుకోలేదు. ముడిసరుకుల నుండి, ప్రసాదం బయటకు వచ్చేవరకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రపంచంలో ఎవరూ ఎక్కడా తయారు చేయలేకపోయారు... దీనికి పేటెంట్ కూడా ఉంది. పవిత్రమైన శ్రీవారి లడ్డు, జిలేబీ, మైసూర్ పాక్, వడకు ప్రత్యేకత ఉంది... అని చంద్రబాబు వివరించారు.

## మనకి ఆ బాధ్యత లేదా..? : సీఎం రేవంత్ సూటి ప్రశ్న

మొదటి పేజి తరువాయి



సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే వాళ్లని ఎలా ఆదుకోవాలో ప్రతిపక్షాలు కూడా చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి జీ వెంకటస్వామి జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. చెరువులు, కుంటలు, నాలాలు కబ్జాలకు గురవుతున్నాయని, ఇక మూసీ కూడా పూర్తిగా కబ్జా అయిపోతే ఆ తరువాతి కాలంలో అనంతగిరి నుంచి వచ్చే వరద నీటిని హైదరాబాద్ ఎలా భరించగలుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.? "ఈ రోజున హైదరాబద్ నగరంలో 1200, 1400 ఫీట్ బోర్ వేయకుండా ఎక్కడా నీళ్లు రావడం లేదు. హైదరాబాద్ నగరం మొత్తం కాంక్రీట్ జంగిల్ అయిపోయింది. గ్రౌండ్ వాటర్ పడిపోయింది. హైదరాబాద్ మురికితో మూసీ నిండిపోయి ఆ విషవాయువులు నల్గొండ ప్రజలకు విషంగా మారుతోంది. నల్గొండని ఆదుకోవాల్సిన బాధ్యత కూడా మనదే కదా. మా ప్రభుత్వానికి ఎవరిమీదా కోపం కానీ, పట్టింపులు కానీ లేవని, కేవలం ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన తప్ప వేరే ఆలోచనే లేదు" అని సీఎం పేర్కొన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్‌తో కలిసి ముఖ్యమైన నాయకులందరినీ పిలిచి మూసీ నిర్వాసితులకు ఎలా న్యాయం చేయాలో చర్చించాలని కోరారు. అలాగే ప్రతిపక్షాలిచ్చే సూచలని ప్రభుత్వం స్వీకరిస్తుందని, ఉద్యోగాల కోసం వలసలు వచ్చి పేదరికంతో మూసీ మురికి కూపాల్లో బతుకుతున్న వారి జీవితాల్లో మార్పు తీసుకురావడానికి, మెరుగైన వసతి కల్పించడానికి అవసరమైన ప్రణాళికలను తయారు చేస్తే.. వాటిని తమ ప్రభుత్వం అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. కాకా వెంకటస్వామి స్ఫూర్తితో పేదలకు జీవితాల్లో వెలుగులు తీసుకొద్దామని పిలుపునిచ్చారు. అవసరమైతే రేస్ కోర్సుని బయటకు తరలిద్దామని, అప్పుడు 150 ఎకరాల స్థలంలో పేదలకు పక్కా ఇళ్లు కట్టించొచ్చని, లేకపోతే అంబర్ పేటలో పోలీస్ అకాడెమిని సిటీ బయటకు తరలిస్తే 200 ఎకరాలు స్థలం ఉంటుందని, ఇదంతా ప్రభుత్వ భూమి కాబట్టి అందులో అయినా మూసీ నిర్వాసితులకు ఇళ్లు కట్టించొచ్చని రేవంత్ రెడ్డి అన్నారు. దీనిపై ప్రతిపక్షాలు సూచనలు చేయాలని, ప్రభుత్వం కమిటీ వేస్తుందని, అవసరమైతే ఆ కమిటీలో కేటీఆర్, ఈటల రాజేందర్‌ని కూడా సభ్యులుగా పెడతామని అన్నారు. ప్రతిపక్షాలతో కలిసి పనిచేయడానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్.. అందరూ కలిసి పేదలకోసం ఏం చేయాలో ఆలోచన చేద్దామని సీఎం రేవంత్ పిలుపుపిచ్చారు.

## ఇది నా విజయమో, వైసీపీ విజయమో అనుకోవడంలేదు

మొదటి పేజి తరువాయి

వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి స్పందించారు. ఓ మీడియా చానల్ తో మాట్లాడుతూ, ఇవాళ సుప్రీంకోర్టు తీర్పును తన విజయమో, వైసీపీ విజయమో అనుకోవడంలేదని స్పష్టం చేశారు. ఇది కోట్లాది మంది భక్తులకు సంబంధించిన విషయం అని పేర్కొన్నారు. స్వతంత్ర సిట్ దర్యాప్తులో వాస్తవాలేంటో తెలుస్తాయని అన్నారు. లడ్డూ కల్తీ జరిగిందని తమపైనా, తమ పార్టీ అధ్యక్షుడు జగన్ పైనా నిందలు మోపారని కూటమి నేతలపై మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు చేస్తున్నారని, సుప్రీం కోర్టు ఆధ్వర్యంలో జరిగే దర్యాప్తులో వెంకటేశ్వరుడి ఆశీస్సులతో న్యాయం జరుగుతుందని నమ్ముతున్నట్టు వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. స్వతంత్ర సిట్ ను వేస్తున్నామని సుప్రీంకోర్టు చెప్పిందని, అందులో కేంద్రం నుంచి ఇద్దరు, రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారులు, ఫుడ్ సేఫ్టీ అథారిటీ నుంచి ఒక నిపుణుడు ఈ సిట్ లో సభ్యులుగా ఉంటారని వైవీ వివరించారు. ఇవాళ కోర్టులో జరిగిన ప్రొసీడింగ్స్ ను బట్టి చూస్తే... సిట్ నివేదికను మళ్లీ సుప్రీంకోర్టుకే సమర్పించాల్సి ఉంటుందని భావిస్తున్నట్టు తెలిపారు. అత్యు న్నత న్యాయస్థానం ద్వారా తప్పకుండా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. ఎన్డీయే కూటమి చేస్తున్న ఆరోపణలు ఎంతో బాధ కలిగించాయని వెల్లడించారు. సుప్రీంకోర్టు పరిధిలో విచారణ జరుగుదతోంది కాబట్టి, ఈ విషయంపై ఇంతకంటే మాట్లాడలేనని స్పష్టం చేశారు. తాను టీటీడీ చైర్మన్ గా వ్య వ హరించిన సమయంలో కానీ, తన తర్వాత భూమన హయాంలో కానీ ఏఆర్ ఫుడ్స్ డెయిరీ నెయ్యి సరఫరా జరగలేదని వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. కొత్త ప్రభుత్వం వచ్చాకే ఆ డెయిరీ నుంచి సరఫరా ప్రారంభమై ఉంటుందని తెలిపారు. ఎవరి హయాంలో టెండర్లు వేశారన్నది సిట్ దర్యాప్తులో తేలుతుందని అన్నారు.

## రేవంత్‌రెడ్డి చేసేది ఫోర్త్ సిటీ కాదు.. ఫోర్ బ్రదర్స్ సిటీ

మొదటి పేజి తరువాయి

నియోజకవర్గ పరిధిలోని కందుకూరు వద్ద నిర్వహించి రైతు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అర్హులైన రేతులందరికీ వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. వడ్లకు బోనస్ ఇస్తానని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. కేవలం బోనస్ పేరుతో బోగస్ మాటలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ వస్తే.. రూ.4 వేల పింఛన్ ఇస్తానని చెప్పిన ఈ ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. 2015 నుంచి 2022 వరకు ఎంతో శ్రమించి ఫార్మా సిటీ కోసం రైతుల నుంచి 14 వేల ఎకరాల భూమి తమ ప్రభుత్వం సేకరించిందని అన్నారు. ఆ భూములు ఫార్మా సిటీ కి తప్పా.. ఫ్యూచర్ సిటీ కి వినియోగించడానికి వీలు లేదని అన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుపేదల భూములను గుంజుకోవడమే పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూముల్లో ఫ్యూచర్ సిటీ ఎలా కడతారని ప్రశ్నించారు. ఏఐ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అంటూ దొంగ నాటకాలు ఆడుతున్నారని కామెంట్ చేశారు. రేవంత్‌రెడ్డి చేసేది ఫోర్త్ సిటీ కాదని.. ఫోర్ బ్రదర్స్ సిటీ అని ఎద్దేవా చేశారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో రైతులు, ప్రజలంతా ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని అన్నారు. రేవంత్‌రెడ్డి కి కమీషన్ల పిచ్చి తప్పాన .. ప్రజా సంక్షేమం పట్టదని అన్నారు. ప్రభుత్వంలో బాధ్యతాయుతమైపదవిలో ఉన్న మంత్రులు కూడా దిక్కుమాలిన మాటలు మట్లాడుతున్నారని కామెంట్ చేశారు. ఇక నుంచి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడితే ఏ మాత్రం సహించేది లేదని అన్నారు. ఇప్పటికే మంత్రిపై పరువు నష్టం దావా వేశానని, అవసరం అయితే సీఎం రేవంత్‌రెడ్డిపై కూడా పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు.

## 'మెట్రో' ఉచిత పార్కింగ్ కల్పించాల్సిందే.. యువజన సంఘాల డిమాండ్



హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కొనసాగించాలని ఎండీకి యువజన సంఘాలు డిమాండ్ చేశాయి. మెట్రో పార్కింగ్ చార్జీలు వసూళ్లు చేయడం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర నేత బి.కృష్ణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్‌లు డిమాండ్ చేశారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి ఎల్అండ్‌టి సంస్థ పార్కింగ్ స్థలంలో సౌకర్యాలు కల్పించకుండా పేయిడ్ చార్జీలు వసూళ్లకు వ్యతిరేకంగా యువజన సంఘాలు, మెట్రో ప్రయాణికులు సంయుక్తంగా నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్రో ప్రయాణికులకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ఎల్అండ్‌టీ సంస్థదే అని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను ఉచితంగా తీసుకుని, వాటిలో ఎటువంటి కనీస వసతులు కల్పించకుండా, ప్రయాణికులు వాహనాలు నిలిపితే పార్కింగ్ చార్జీల పేరుతో దండుకోవడం సరికాదన్నారు. ప్రయాణికుడు అప్పటికే వందల రూపాయలు చార్జీలు మెట్రో ట్రైన్ కి చెల్లిస్తున్నారని, మళ్లీ పార్కింగ్ పేరుతో వసూలు చేయడం, అది కూడా రవాణా చార్జీలతో సమానంగా, అధిక మొత్తంలో వసూలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే నాగోల్, మియాపూర్, మిగతా అన్ని స్టేషన్లలో ఉచిత పార్కింగ్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే నాగోల్ మెట్రో పార్కింగ్ స్థలంలో చిత్తడిగా మారిందని, అదేవిధంగా ప్రయాణికుల వాహనాలకు ఎటువంటి రక్షణ లేదని వారు విమర్శించారు. దీనిపై సంస్థ సానుకూల నిర్ణయం తీసుకోకపోతే యువజన సంఘాలు ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. ఎల్అండ్‌టీ సంస్థ పరిధిలోగల అనుబంధ సంస్థ అయిన ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్మెంట్ ద్వారా మెట్రో రైల్ సౌకర్యాల నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు చూస్తున్నదని వారు అన్నారు. అయితే మెట్రో సంస్థ ఎల్అండ్‌టీ సంస్థకు 30 ఏళ్ళ లీజు అగ్రిమెంట్ ఇచ్చిందని, నిబంధనలకు లోబడే నిర్వహణ విషయంలో ఎల్అండ్‌టీ వ్యవహరించాలన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఛార్జీలను వసూళ్ల చేస్తున్నదని వారు ఆరోపించారు.

## తిరుమలకు పూర్వవైభవం తేవాలి.. అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి : రెండవరోజు తిరుమల పర్యటనలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు. పద్మావతి అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశానికి మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి, టీటీడీ ఈవో, అదనపు ఈవో సహా ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో చంద్రబాబు అధికారులకు కీలక సూచనలు చేశారు. తిరుమల పవిత్రత, నమ్మకం కాపాడేలా ఇక్కడ ప్రతిఒక్కరూ పనిచేయాలని, కొండపై గోవింద నామస్మరణ తప్ప మరో మాట వినిపించకూడదని స్పష్టం చేశారు. ప్రశాతంతకు ఎక్కడా భంగం కలగకూడదని, ఏ విషయంలోనూ రాజీ పడొద్దని, తిరుమలకు పూర్వ వైభవం తేవాలని సూచించారు. భవిష్యత్ నీటి అవసరాలకు తగ్గట్లు నీటి లభ్యత ఉండేలా చూసుకోవాలని, ముందస్తు ప్రణాళిక చాలా అవసరమని అధికారులకు సలహా ఇచ్చారు. అలాగే అటవీ ప్రాంతాన్ని 72 నుంచి 80 శాతంపైగా పెంచాలని, అటవీ సంరక్షణతో పాటు అడవుల విస్తరణ కోసం వచ్చే 5 ఏళ్లకు ప్రణాళికతో పనిచేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

### ప్రతి భక్తుడి నుంచి ఫీడ్ బ్యాక్..

అంతేగాక బయోడైవర్సిటీ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీటీడీ సేవలపై భక్తుల నుంచి స్పందన తీసుకునే విధానంపై అడిగి తెలుసుకున్న సీఎం.. వచ్చిన ప్రతి భక్తుడు తమ అనుభవాలపై అభిప్రాయాలు చెప్పే అవకాశం కల్పించాలని చెప్పారు. అలాగే భక్తుల సూచనలు, సలహాల ఆధారంగా సేవలపై టీటీడీ పనిచేయాలని, ఒక్క టీటీడీలోనే కాకుండా అన్ని దేవాలయాల్లో భక్తుల అభిప్రాయాలు తీసుకునే విధానం తీసుకురావాలని మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డికి ముఖ్యమంత్రి సూచించారు. ఇక లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదం నాణ్యత పెరిగినట్లు భక్తులు చెపుతున్నారని, ఇది ఎల్లప్పుడూ, పూర్తిగా కొనసాగడమే కాకుండా.. మరింత మెరుగుపడాలని తెలిపారు. ప్రసాదాల తయారీలో వాడే పదార్థాల నాణ్యత బాగుండేలా చూడాలని, అత్యుత్తమ పదార్థాలు మాత్రమే వాడాలని చెప్పారు.

తిరుమలలో వీఐపీ సంస్కృతి తగ్గాలి..

ఇక తిరుమలలో వీఐపీ సంస్కృతి తగ్గాలని, ప్రముఖులు వచ్చినప్పుడు హడావుడి కనిపించకుండా.. సింపుల్ గా ఉండాలని అన్నారు. అలాగే టీటీడీ సిబ్బంది భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని, దేశ విదేశాలనుంచి వచ్చేవారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని చెప్పారు. అంతేగాక దురుసు ప్రవర్తన అనేది ఎక్కడా ఉండకూడదవంత్‌ని, భక్తులు సంతృప్తితో, అనుభూతితో కొండ నుంచి తిరిగి వెళ్లా తిరుమల పేరు తలిస్తే.. ఏడుకొండల వాడి వైభవం, ఆధ్యాత్మిక మాత్రమే లని,చర్చకు రావాలని అన్నారు. స్విమ్స్ సేవలు కూడా మెరుగుపరచాలని, ఇదొక ప్రత్యేకమైన క్షేత్రం. తిరుమల పవిత్రత కాపాడడం, ఆధ్యాత్మిక విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇక ప్రముఖ ఆధ్యాత్మిక సంస్థల సహకారంతో శ్రీవారి సేవ (స్వచ్ఛంద సేవను)మరింత బలోపేతం చేయాలని, తద్వారా భక్తులకు సేవకుల ద్వారా చక్కటి సేవలు అందించాలని చంద్రబాబు అధికారులతో అన్నారు.

# .ధనలక్ష్మి అవతారంలో అమ్మవారు!!

### కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూరి సురేష్ ప్రత్యేక పూజలు





నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు నవరాత్రులలో ఉత్సవాలలో భాగంగా శనివారం ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించిన పూరి సురేష్ శెట్టి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఎంతో ఘనంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఉదయం పూజలు అనంతరం మధ్యాహ్నం నారాయణ సేవ మరియు రాత్రి పూజలు అల్పాహారం వచ్చిన భక్తులకు అందరికీ కూడా అన్న ప్రసాద వితరణ చేయడం జరుగుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆకుతోట దేవరాజు దాచా సంతోష్ ఈ పూరి వెంకటేష్ నూకల విజయ్ చిగుళ్లపల్లి రవికుమార్ జగదీశ్వర్ కొండూరు ప్రవీణ్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు, దసరా పండుగ ముందు తొమ్మిది రోజులపాటు నిర్వహించే కన్యకా పరమేశ్వరి పూజలు నిష్ఠతో కొనసాగుతాయని అమ్మవారు ఆయురారోగ్యాలతో ప్రజల సుఖసంతోషాలతో జీవించాలని అతివృష్టి అనావృష్టి నుంచి ప్రజలను కాపాడాలని భక్తులు ఆర్యవైశ్య సంఘం నాయకులు మహిళలు అమ్మవారిని వేడుకుంటారు, ఈ సందర్భంగా అమ్మవారు రోజుకొక అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నట్లు పూరి సురేష్ శెట్టి తెలిపారు,

## కోయగూడెం ఓసి 2 నిర్వాసితుల విజయోత్సవ సభ

### ముఖ్య అతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



టేకులపల్లి (గౌతమ్ న్యూస్): శనివారం:కోయగూడెం ఓసి 2 భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని గౌరవ హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని హర్షిస్తూ ఆదివారం నాడు టేకులపల్లి లో విజయోత్సవ ర్యాలీ,సభ నిర్వహిస్తున్నామని తెలంగాణ భూ నిర్వాసితుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ తెలిపారు, శనివారం నాడు సంఘం కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ , అతిథులు గా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, బేతంపూడి కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ లక్కినేని సురేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య లు పాల్గొంటారని తెలిపారు,ఈ కార్యక్రమంలో కోయగూడెం ఓసి నిర్వాసితులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విప్లవాభివందనములతో... రేపాకుల శ్రీనివాస్

## ఎండి జహారాభి మునిమనవడు అఫాన్ కు ప్రకృతి హరిత దీక్ష నిచ్చిన

### ప్రకృతి హరిత దీక్ష అధ్యక్షుడు మొక్కల రాజశేఖర్.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం రామవరం లో నాలుగు తరముల వారు వరుసగా మహమ్మద్ జహా రాభి(80 సంవత్సరములు) ముస్తఫా (రామవరం పరిరక్షణ కమిటీ అధ్యక్షులు,54 సంవత్సరములు), అమన్(30 సంవత్సరములు),ఆఫాన్(3 సంవత్సరములు), అఫాన్ కి ప్రకృతి హర్షదేశను ఇచ్చి చిన్నారుల కి కూడా చిన్నతనం నుంచి పర్యావరణం పై అవగాహన కల్పించడానికి ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపక అధ్యక్షుడు మరియు114వ “మన్ కి బాత్”లో భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ చేత అభినందించబడ్డ కే.ఎన్ రాజశేఖర్ అలియాస్ మొక్కల రాజశేఖర్ దీక్ష ఇచ్చి ప్రతిరోజు మొక్కలు నాటాలని తెలిపారు.

## వేంశెట్టి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించిన చిలువేరు సమ్మయ్య గౌడ్



మానుకోట జిల్లా (గౌతమ్ న్యూస్): శనివారం కేసముద్రం విలేజ్ లో వేంశెట్టి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులు అయిన సత్యనారాయణ కుమారులు నారాయణ, శ్రీను, రమేష్, కృష్ణమూర్తి, మహేష్, వేణు లను సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపి సత్యనారాయణ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ పరామర్శలో గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్, మాజీ సర్పంచ్ గుతుప మణి రమేష్, కీర్తి సుధాకర్, ఫౌండేషన్ సభ్యులు ఎర్రం శెట్టి అశోక్, శ్రీను, కొండేటి కళాధర్, ప్రవీణ్ అన్న పబ్బతి ప్రశాంత్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## గంధంపల్లిలో అందని మిషన్ భగీరథ నీరు

### స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య.



బయ్యారం(గౌతమ్ న్యూస్): బయ్యారం మండలంలోని గంధంపల్లి-కొత్తపేట పంచాయితి పరిధిలో పలు కాలనీ వాసులకు మిషన్ భగీరథ నీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్ నాయక్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య తన సొంత నిధుల నుంచి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయించి శనివారం పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రక్షిత మంచినీటి పైపులైన్ పనులకు 5 లక్షలు నిధులు వెచ్చించి పనులను ప్రారంభించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై స్పందించిన కాలనీ వాసులు గ్రామ కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కారు పోతుల రామ్మూర్తి, ధనసరి వీరభద్రం, బొమ్మగంటి రాంబాబు, పుల్లూరు బాలరాజు, పసుపులేటి సతీష్, గట్టు శీను, సంతోష్, లింగయ్య, మిస్సు రామయ్య, అశోక్ రెడ్డి, జలగం ఉపేంద్ర, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.



# బతుకమ్మపండుగ, తెలంగాణా సాంస్కృతిక చిహ్నం ..



కురవి (గౌతమ్ న్యూస్): కురవి మండల కేంద్రం లోని లింగ్యతండా (బి )గ్రామం లో ఈ నాలుగవ రోజు నానుబియ్యం బతుకమ్మను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ అధ్యక్షులు మాలోత్ హరిలాల్ నాయక్, కురవి మండల కోఆర్డినేటర్ మాలోత్ రమేష్ నాయక్ మరియు మాంజ్యాజి నాయక్ గారు మాట్లాడుతూ,,తొమ్మిది రోజుల పూల సంబరంబీ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచేది బతుకమ్మ పండుగ. తెలంగాణ ఆడపడుచులు అంతా సంబరంగా జరుపుకునే వేడుక. బంధాలను, అనుబంధాలను గుర్తు చేస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పండుగ బతుకమ్మ పండుగ. ఇదో పూల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ. తొమ్మిది రోజుల పాటు ఆడి పాడి గౌరీ దేవిని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే తెలంగాణకే ప్రత్యేకమైన పూల సంబరం బతుకమ్మ పండుగ.

### తొమ్మిది రోజుల పాటు సాగే పూల ఉత్సవం బతుకమ్మ

ఆశ్వయుజ అమావాస్య నాడు ఎంగిలిపూల బతుకమ్మగా ప్రారంభమయ్యే సంబరాలు తొమ్మిదిరోజులపాటు సాగి సద్దుల బతుకమ్మ రోజు గౌరమ్మను సాగనంపడంతో ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు చేసే హడావిడి అంతా ఇంతా కాదు. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వు ఏరికోరి తెచ్చి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, నిత్యం గౌరీదేవిని తమ ఆటపాటలతో పూజిస్తారు. అందరూ కలిసి సంతోషంగా పాటలు పాడుతూ, బతుకమ్మ ఆటలు ఆడతారు. ఒకరు పాడుతుంటే మిగతా వారంతా వారికి వంత పాడతారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమయ్యే ఈ వేడుకలు సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. పిత్రు అమావాస్య రోజు పెద్దలను పూజించుకుంటూ, అదే సమయంలో బతుకమ్మలను పేర్చి మహిళలు సంబరాలు జరుపుకుంటారు.

### బతుకమ్మ పూలకు ప్రత్యేకతలెన్నో

బతుకమ్మ పండుగ జరుపుకోవడానికి ఉపయోగించే పూలకు కూడా ఒక విశేషం ఉంది. ఔషధ గుణాలు ఉన్న పువ్వులను బతుకమ్మలుగా పేర్చడం కోసం ఉపయోగిస్తారు. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, కట్ల, సంపెంగ, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, పోక బంతి, మల్లె, మందార, మరువం, పారిజాతం, కమలం, తామర, గన్నేరు గుమ్మడి, గులాబీ, పట్టుకుచ్చులు పూలతో చక్కగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలను జరుపుకుంటారు. బతుకమ్మ సంబరాలలో భాగంగా మహిళలు చక్కగా ముస్తాబై అత్యంత భక్తి శ్రద్ధలతో తయారుచేసిన బతుకమ్మలను తీసుకొని ఆలయాలలో, వీధులలో అందరూ గుంపుగా కూడి సంబరాలు జరుపుకుంటారు. చిన్న, పెద్ద, ముసలి, ముతక తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ సంబరాలలో పాలుపంచుకుంటారు. తెలంగాణ సంస్కృతిని, తెలంగాణ గ్రామీణ జీవనాన్ని ప్రతిబింబించేలా జానపదాలను పాడుతూ ఈ

### తొమ్మిదిరోజుల బతుకమ్మ వేడుకలు .. నైవేద్యాలు

ఎంగిలిపూల బతుకమ్మగా మొదటి రోజు ఉదయం అత్యంత భక్తి శ్రద్ధలతో బతుకమ్మలను పేర్చి పూజిస్తారు. అమ్మవారికి నైవేద్యంగా నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి ప్రసాదం తయారు చేస్తారు. 2వ రోజు ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు అటుకుల బతుకమ్మను జరుపుకుంటారు. అటుకులు, పప్పు, బెల్లం తో నైవేద్యం తయారు చేసే అమ్మవారికి నివేదిస్తారు. మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మతో మహిళలు సంబరాలు చేసుకుంటారు. ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి గౌరీ దేవికి సమర్పిస్తారు. నాలుగవ రోజు నానుబియ్యం బతుకమ్మను జరుపుకుంటారు. నానబెట్టిన బియ్యం, బెల్లం ,పాలు కలిపి నైవేద్యం తయారుచేసి అమ్మవారికి నివేదించి వేడుక చేసుకుంటారు. ఇక ఐదవ రోజు అట్ల బతుకమ్మను జరుపుకుంటారు. ఆ రోజు అమ్మవారికి నైవేద్యంగా అట్లను, దోసెలను పెట్టి పూజిస్తారు. ఆరవ రోజు బతుకమ్మను జరుపుకోరు. ఆరోజు అలిగిన బతుకమ్మ పేరుతో సంబరాలకు దూరంగా ఉంటారు. మళ్లీ ఏడవ రోజు వేపకాయల బతుకమ్మతో వేడుక చేసుకుంటారు. వేప పండ్లలా బియ్యంపిండిని చుట్టి, వాటిని బాగా వేయించి, వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. 8 వ రోజు వెన్నముద్దల బతుకమ్మతో సంబరాలు జరుపుకుంటారు. ఎనిమిదవ రోజు వెన్న, నువ్వులు, బెల్లం కలిపి నైవేద్యంగా తయారుచేసి అమ్మవారికి నివేదిస్తారు.తొమ్మిదవ రోజు చివరగా అత్యంత ముఖ్యమైన సద్దుల బతుకమ్మ ను జరుపుకుంటారు. ఆశ్వయుజ అష్టమి నాడు,అంటే దుర్గాష్టమి నాడు



ఐదు రకాల నైవేద్యాలతో సద్దుల బతుకమ్మ ను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకుంటారు. సద్దుల బతుకమ్మ రోజు అమ్మవారికి నైవేద్యంగా పెరుగన్నం, చింతపండు పులిహోర, నిమ్మకాయ అన్నం, కొబ్బరి అన్నం, నువ్వుల అన్నం తయారు చేసి అమ్మవారికి నివేదిస్తారు.ఈ తొమ్మిది రోజులు అమ్మవారికి నైవేద్యం పెట్టే వాటిలో రక రకాల తృణధాన్యాలను వినియోగిస్తారు జైహింద్

# వనపర్తి లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఫ్లెక్సీల తొలగింపు!!



## కాంగ్రెస్ వికృత చేష్టలు!!

## టిఆర్ఎస్ నాయకుల ఆరోపణ!!

నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఫ్లెక్సీలను కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా తొలగించి వికృత చేష్టలను బయట పెట్టుకున్నదని వనపర్తి జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షులు రమేష్ గౌడు టిఆర్ఎస్ నాయకులు వాటికి శ్రీధర్ , ఆరోపించారు, శనివారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫ్లెక్సీలు తొలగించినంతమాత్రాన నిరంజన్ రెడ్డి పైన ఉన్న అభిమానాన్ని ఆయన హయంలో జరిగిన అభివృద్ధిని ఎవరు తొలగించ లేరని ఈ సందర్భంగా అన్నారు, నిరంజన్ రెడ్డి మీద కోపంతో దసరా దీపావళి కోసం ఏర్పాటు చేసిన నూతన వాణిజ్య వర్గాల ఫ్లెక్సీలు కూడా తొలగించడం అన్యాయం.కాంగ్రెస్ పార్టీ కక్ష్యపూర్తి చర్యలతో రాజకీయ వైషమ్యాలను సృష్టిస్తుంది.నిరంజన్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను 24గంటలు గడవకముందే తొలగించడం వికృత చర్య అని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి మరచి ఇచ్చిన వాగ్దానాలు మరచి పొద్దున లేస్తే నిరంజన్ రెడ్డి గారినీ తిట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు , నిరంజన్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో అభివృద్ధి తప్ప కక్ష్యపురిత చర్యలకు పాల్పడలేదని అన్నారు బి.ఆర్.ఎస్ పార్టీ బి. ఫాం మీద గెలిచి కనీస మర్యాద లేకుండా నిరంజన్ రెడ్డి గారి ఫ్లెక్సీలు తొలగించడం నీతిమాలిన చర్య అని దుయ్యబట్టారు. గతములో ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటు చేసిన మినిమం వారం రోజులు వాళ్లకు సమయం ఇచ్చామని అన్నారు. కనీస సమాచారం ఇవ్వకుండా ఫ్లెక్సీలు తొలగించడం కాంగ్రెస్ పార్టీ పరాకాష్టకు నిదర్శనం అని అన్నారు.డబ్బుల సంచులతో,కన్నతల్లి లాంటి పార్టీని మోసం చేసి అదికారధాహముతో పదవులు పొందిన వారికి ప్రజల మనసులో చోటు వుండదని ఇకనైనా కక్ష్య పూర్తి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. పట్టణ అధ్యక్షులు పి రమేష్ గౌడ్ మాట్లాడుతూ నిరంజన్ రెడ్డి జన్మదినం అభిమానులు, శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించి 125యూనిట్ల రక్తం సేకరించారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. వనపర్తిలో రాజకీయ పార్టీలు హుందాగా వ్యవహరించేవని కానీ నేటి పాలకులు కక్ష్యపూర్తిగా 24 గంటల్లో మాజీమంత్రి నిరంజన్ రెడ్డి అభిమానులు కట్టిన ఫ్లెక్సీలు తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు.గతములో మేము కూడా ఛైర్మెన్ పదవి చేశామని ఈవిధంగా చేయడం దురదృష్టకరం అని అన్నారు. వాకిటి.శ్రీధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ వైషమ్యాలను సృష్టిస్తుంది అని మేము ఏనాడు ఇటువంటి చర్యలకు పాల్పడలేదని అన్నారు.వివేకానంద విగ్రహం దగ్గర మేము ఏర్పాటు చేసుకున్న హోర్డింగ్ నందు ఎం.ఎల్.ఏ ఫ్లెక్సీ కట్టినా మేము హుందాగా వున్నామని అన్నారు.ఫ్లెక్సీలు తొలగించడం అనాగరిక చర్య అన్నారు.ఈ సమావేశంలో జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల.అశోక్,మండల పార్టీ అధ్యక్షులు మాణిక్యం,పార్టీ ప్రధాన కార్యదర్శి గంధం.పరంజ్యోతి, ఉంగ్లమ్. తిరుమల్,స్టార్.రహీమ్,కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్,సూర్యవశం.గిరి, జోహెబ్ హుస్సేన్,చిట్యాల.రాము, లీమ్కి,వజ్రాల.రమేష్,తోట.శ్రీను పాల్గొన్నారు.

# బిజెపి సభ్యత్వానికి అపూర్వస్పందన!!

## వనపర్తి జిల్లాలో ముమ్మరంగా సభ్యత్వం!!

## బిజెపి వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్




నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో(గౌతమ్ న్యూస్): భారతీయ జనతా పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ముమ్మరంగా కొనసాగుతున్న బిజెపి సభ్యత్వం ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో వనపర్తి జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతుందని బిజెపి వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కల రామన్ గౌడ్ వెల్లడించారు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందని రెండవ స్థానంలో మక్తల్ నియోజకవర్గం ఆ తర్వాత మూడో స్థానంలో వనపర్తి నిలవడం గర్వకారణమని ఆయన అన్నారు, భారతీయ జనతా పార్టీ వైపు వైపు బడుగు బలహీన వర్గాల ప్రజలు ముఖ్యంగా రైతులు మహిళలు యువకులు భారీ ఎత్తున బిజెపి సభ్యత్వం స్వీకరిస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు, కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టడం వల్లనే బిజెపి మళ్లీ తెలంగాణ రాష్ట్రంలో పెద్ద మొత్తంలో పుంజుకున్నదని ఆయన అన్నారు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపికి ఓటింగ్ శాతం భారీ మొత్తంలో పెరిగిందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి తమ ప్రభంజనని సృష్టించి అన్ని గ్రామ పంచాయతీలు మున్సిపల్ చైర్మన్లు వంటి పదవులు బిజెపి కైవాసం చేసుకోవడం ఖాయమని ఆయన ఈ సందర్భంగా అన్నారు, బిజెపి సభ్యత్వం దేశవ్యాప్తంగా కొనసాగుతున్న నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో బిజెపి సభ్యత్వానికి భారీ స్పందన లభిస్తుందని రామన్ గౌడ్ ఈ సందర్భంగా అన్నారు, బిజెపి పార్టీలో యువతకు మహిళలకు ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తున్న ఏకైక పార్టీ బిజెపి మాత్రమే అన్నారు, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఈ రాష్ట్ర ప్రభుత్వం మరుగున పెట్టి బిజెపి పథకాలను ప్రజలకు అందకుండా కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు, అనేక సంక్షేమ పథకాలను గత టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రాష్ట్రంలో పథకాలను ప్రజలకు దరిచేరకుండా చేస్తున్నారని ఆయన ఆరోపించారు, బిజెపి సభ్యత్వ కార్యక్రమానికి భారీ స్పందన వస్తుందని, ఓర్వలేక టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా బీజేపీ సభ్యత్వం ఊహించని రీతిలో భారీ మొత్తంలో చేపడుతుందని అన్నారు, సిద్ధాంతం గల పార్టీ క్రమశిక్షణ గల పార్టీ ఈ దేశంలో కేవలం బిజెపికి మాత్రమే దక్కుతుందని ఈ విషయం ప్రతి ఒక్కరు గమనించి బిజెపి పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు, ఇప్పటికైనా కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి ప్రభుత్వానికి సహకరించి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచాలని ఆయన డిమాండ్ చేశారు, వనపర్తి జిల్లాలో బిజెపి సభ్యత్వం తో పాటు యువమోర్చా, దళిత మోర్చా, మహిళా మోర్చా, వంటి అనుబంధ సంస్థలు కీలకంగా పనిచేస్తున్నాయని హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు,

## మానుకోట జిల్లా, మండల పి.ఆర్.టి.యు అధ్యక్షుల ఎన్నిక




మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** పి ఆర్ టి యు టి ఎస్ మహబూబాబాద్ జిల్లా కార్యవర్గంలో మహబూబాబాద్ మండలానికి తగిన గుర్తింపు. ఇటీవల జరిగిన పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా కార్యవర్గంలో మహబూబాబాద్ మండలానికి తగు ప్రాతినిధ్యం లభించినది. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా పెనుగొండ ప్రవీణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులుగా హలవత్ శంకర్, జిల్లా కార్యదర్శిగా గుర్రాల వెంకన్న, మహిళా ఉపాధ్యక్షులుగా గుగ్గిళ్ళ భవాని, మహిళా కార్యదర్శిగా సంకేపల్లి కీర్తన రెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గానికి వీరిని ఎంపిక చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ తమ ఎన్నికకు సహకరించిన జిల్లా శాఖ అధ్యక్షులు సంకా బద్రినారాయణ, ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్ రెడ్డి, కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘ నిర్మాణానికి తోడ్పడుతామని ఈ సందర్భంగా వారు అన్నారు. మహబూబాబాద్ మండల శాఖ అధ్యక్షులు భూక్యా రామోజీ నాయక్, ప్రధాన కార్యదర్శి కాపరబోయిన సుజాత రాష్ట్ర బాధ్యులు టీ.మురలీధర్ స్వామి, బి.గీత, వై ఉమాదేవి, కళ్లెం వెంకటరెడ్డి ,గుగులోతు హాల్యా నాయక్, కోట కనకయ్య, ఆకారపు వెంకటేశ్వర్లు మరియు జిల్లా బాధ్యులు మండల బాధ్యులు ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలియజేశారు.


## సింగరేణి హెడ్ ఆఫీస్ లో గడ్డం వెంకటస్వామి(కాకా)
# 95 వ జయంతి వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం : సింగరేణి ప్రధాన కార్యాలయం లోని హెచ్ఆర్డి కాన్ఫరెన్స్ హాల్ వద్ద గడ్డం వెంకట స్వామి గారి 95వ జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా జనరల్ మేనేజర్ (ఈ-ఎం) ఓసిపి డివిఎస్ సూర్య నారాయణ రాజు హాజరయ్యారు. ముందుగా గడ్డం వెంకట స్వామి చిత్ర పటానికి ముఖ్య అతిది జనరల్ మేనేజర్ (ఈ-ఎం) ఓసిపి డివిఎస్ సూర్య నారాయణ రాజు, యూనియన్ నాయకులు, శాఖాధిపతులు, అధికారులు మరియు ఉద్యోగులు ఆయనకు ఘనంగా పూలమాలతో మరియు పూలతో ఘనం గా నివాళులు అర్పించారు.అనంతరం ఈ సంధర్భముగా జనరల్ మేనేజర్ (ఈ-ఎం) ఓసిపి డివిఎస్ సూర్య నారాయణ రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రముఖ రాజకీయ వేత్త జయంతి ఉత్సవాలను జరుపుకుంటూ ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకోవటం చాలా సంతోషముగా ఉందని, ఆయన పేదలకు ఎన్నో సేవలను చేశారని ముఖ్యముగా సింగరేణియులకు గడ్డం వెంకట స్వామి ఎంతో సుపరిచితులని, వీరు కార్మిక శాఖా మంత్రిగా పనిచేసిన సమయంలో సింగరేణి ఉద్యోగులకు పెన్షన్ స్కీమ్ మరియు సింగరేణి సంస్థ బిఐఎఫ్ఆర్ నుండి బయటకు తీసుకురావటానికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జనరల్ మేనేజర్ (ఈ-ఎం) ఓసిపి డివిఎస్ సూర్య నారాయణ రాజు గారితో పాటు జిఎం(ఎన్విరాన్మెంట్) ఏ.మనోహర్, జిఎం(హెచ్ఆర్డి) వీసం కృష్ణయ్య, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ పీతాంబరరావు, డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ జి.రాజేంద్ర ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ముకుంద సత్యనారాయణ, డివై.పిఎం లు బి.సుశీల్ కుమార్, కే.శివ కుమార్, కమ్యూనికేషన్ ఆఫీసర్ టి.శ్రీనివాస రావు, కార్పొరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకురాలు
## నెరవట్ల లక్ష్మీబాయి మృతి పార్టీకి తీరని లోటు

**సంతాప సభలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు.**



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్):** కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం లోని మధుర బస్తికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు నెరవట్ల లక్ష్మీబాయి మృతి సిపిఐ దాని అనుబంధం మహిళ సంఘానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్థానిక పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సంతాపను ఉద్దేశించి అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బరిగెల సంపూర్ణ, సిపిఐ నాయకులు స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ నేరెళ్ల సమైక్య, పిడుగు శ్రీను, బరిగెల భూపేష్, నేరెళ్ల రమేష్ , ఎల్. వినాయక్,జూపాక రమేష్, ఉరుస సుదర్శన్, ఏ. అప్పారావు,దాసరి రాయలింగు,లక్ష్మీబాయి కుటుంబ సభ్యులు భర్త నెరవట్ల రాజయ్య, కూతుర్లు భ్రమరాంబిక, ప్రసన్న, నర్మద, శైలజ, రాజు, తిరుపతి, నేరవట్ల పోశమల్లు, రాంబాయి, బరిగెల సత్యం, శారద, కొమ్ము కొమరమ్మ, కొండ్ర శేఖర్, డీకొండ సునీత, సూధనాల రమేష్, పద్మలత, మెరుగు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మహా అన్నదాన కార్యక్రమం



**దుర్గ భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో**

నర్సాపూర్ **(గౌతమ్ న్యూస్):** మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని శ్రీ కోదండరామ స్వామి దేవాలయంలో దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవి శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దుర్గ భవాని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు

# గ్రంధాలయ చైర్మన్ ఎంపిక పై అసంతృప్తి!!

## కవులు, కళాకారులు
## మేధావులకు మొండిచేయి!!
## అవగాహన లేకున్నా పదవులు!!



నాగర్ కర్నూల్ వనపర్తి బ్యూరో **(గౌతమ్ న్యూస్):** ఇటీవల వనపర్తి గ్రంథాలయం చైర్మన్ ఎంపికపై ఒకపక్క కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసిన నాయకులు మరొక్క గ్రంథాలయాల పట్ల పుస్తకాల పట్ల విజ్ఞానవంతులైన సాహితీ కవులు కళాకారులు మేధావులు విస్మయం వ్యక్తం చేస్తూ అసంతృప్తితో రగిలిపోతున్నారు, వనపర్తి జిల్లా గ్రంథాలయం చైర్మన్ పదవిని రాష్ట్ర మంత్రి తన ప్రతాపని చూపించారు, వనపర్తి జిల్లా గ్రంథాలయ పదవిని వనపర్తి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా పనిచేస్తున్న ఎంతోమంది నాయకులు పదవులు కోసం వేచి చూస్తున్న తరుణంలో కొల్లాపూర్ నియోజక వర్గంలోని పానగల్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన గోవర్ధన్ సాగర్ కు గ్రంథాలయం చైర్మన్ పదవిని మంత్రి జూపల్లి కృష్ణారావు కట్టబెట్టడం పట్ల విమర్శలు వస్తున్నాయి, కొల్లాపూర్ నియోజక వర్గంలోని పానగల్ , వీపనగండ్ల, చిన్నంబాయి మండలాలు జిల్లా విషయానికొస్తే వనపర్తి జిల్లా పరిధిలోకి వస్తున్నాయి, అందువల్లనే మంత్రి తనకు నచ్చిన తన అనుచరులకు ఈ ఈ పదవిని ఇచ్చినట్లు తెలుస్తుంది, వనపర్తి జిల్లా స్థాయి చైర్మన్





పదవి ఈ జిల్లా లోని నాయకులకు ఇవ్వకుండా నాగర్ కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన నాయకుని ఏకపక్షంలో ఎంపిక చేసి పదవి కట్టడం వల్ల కాంగ్రెస్ పార్టీలో రుస రుసలు చర్చలు జరుగుతున్నప్పటికీ మరోపక్క వనపర్తి జిల్లాలో గత పది సంవత్సరాల కాలం నుంచి విద్యావంతుడు రాష్ట్ర అవార్డు గ్రహీత గెజిటెడ్ హెడ్మాస్టర్ జిల్లా సాహితీ కళా వేదిక అధ్యక్షులు రచయిత పలుస శంకర్ గౌడ్ వృత్తిపరంగా ఉపాధ్యాయుడు అలాంటి విద్యావంతుడు పుస్తకాల పైన పూర్తి పట్టు కలిగిన కవి రచయిత శంకర్ గౌడ్ కు గ్రంథాలయ చైర్మన్ పదవి ఇవ్వడానికి ఇటీవల కొన్ని సందర్భంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షులు చిన్నారెడ్డి వనపర్తి శాసనసభ్యులు మెగా రెడ్డి సానుకూలంగా స్పందించినప్పటికీ ఆయన అభ్యర్థిత్వాన్ని సుముఖంగా వ్యక్తం చేసినట్లు ఇక్కడి కవులు కళాకారులు చర్చించుకుంటున్నారు, విద్యావంతులు మేధావులు కవులు కళాకారులు రచయితలకు పుట్టిన జిల్లాగా వనపర్తికి పేరు ఉంది, మంత్రి జూపల్లి కృష్ణారావు మాత్రం గ్రంథాలయ చైర్మన్ పదవి తన నియోజకవర్గం లో గ్రంథాలయాల పట్ల పుస్తకాల పట్ల అనుభవం రాజకీయంగా విద్యాపరంగా కూడా అనుభవం లేకపోయినా ప్రతి ప్రాముఖ్యత గల చైర్మన్ పదవిని ఇవ్వడం పై ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు,వనపర్తి జిల్లాలో సాహితి కళా వేదిక అధ్యక్షులుగా గజిటెడ్ ప్రధానోపాధ్యాయుడుగా విద్యావంతుడుగా ఎంతో పేరు కలిగిన శంకర్ గౌడ్ జిల్లాలో పుస్తక సేకరణ చేపట్టి దాదాపు 5 లక్షల రూపాయల విలువగల 40 వేల పుస్తకాలను సేకరించి జిల్లాలోని శాఖ గ్రంథాలయాలకు విద్యాసంస్థలకు పంపిణీ చేసి అందరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారు, జనహితమే అభిమతం అనే పద్ధతిలో వనపర్తి జిల్లాలోని కవులు, కళాకారులు రచయితలు మేధావులకు మొండి చేయి చూపించారు,ఎంతో కీలకమైన గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి, అంకిత భావంతో పుస్తక సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది దాతల నుంచి సేకరించిన పుస్తకాలను సాహితి కళావేదిక జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ప్రతి ఒక్కరు విజ్ఞవంతులు కావాలని పుస్తక పఠనం మానసిక ఆనందాన్ని ఇస్తుందని అందుకే ఈ



గొప్ప కార్యక్రమాన్ని చేపట్టి ఈ జిల్లాలో అందరి అతర అభిమానాలు పొంది ప్రశంసలు అందుకున్నారు, విజ్ఞానానికి సంబంధించిన గ్రంథాలయ చైర్మన్ విజ్ఞాన వంతులకు ఇవ్వకుండా అవగాహన లేని నాయకులకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని జిల్లాలోని మేధావులు అంటున్నారు, ఇప్పటికైనా పునరాలోచించి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బాధ్యతలను సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షులు విద్యావంతుడు పలుస శంకర్ గౌడ్ ఇవ్వాలని డిమాండ్లు వస్తున్నాయి, ఎంతో కీలకమైన ఈ పదవి విద్యావంతులకు కవులకు రచయితలకు ఇవ్వాలని దీనిపైన పునర్ పరిశీలించుకోవాలని పలువురు సూచించారు,

# మున్సిపాలిటీ కార్మికులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేయూత

మానుకోట జిల్లా **(గౌతమ్ న్యూస్):** మానుకోట జిల్లా మున్సిపాలిటీ కేంద్రంలోగల గాంధీ పార్క్ నందు మున్సిపాలిటీ కార్మికులకు నిత్యవసర సరుకులు, న్యూట్రిషన్ కిడ్స్ అందజేసిన లయన్స్ క్లబ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ లయన్ రోయ్యురి సురేష్, సెక్రటరీ లయన్ డాక్టర్ ధారావత్ రెడ్డి నాయక్, శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ కంటి హాస్పిటల్, బేరా సొసైటీ ప్రతినిధులు. మానుకోట జిల్లాలో గత రెండు నెలలుగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ సఫాడ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి హాస్పిటల్ ప్రారంభించి, ఉచితంగా పేదలకు కాట్రాక్ సర్జరీ ఉచితంగా చేయడానికి తమ వంతుగా హాస్పిటల్ ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ షేపార్డ్ ఆధ్వర్యంలో సుమారు 50 ఉచిత ఆపరేషన్లు నిర్వహించారు. అదేవిధంగా మహబూబా జిల్లాలో గత కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షానికి కొన్ని గ్రామాలు అతలాకుతలమై ఎన్నడూ లేని విధంగా భారీ నష్టాన్ని చెవి చూసింది. ఈ సందర్భంలో రైతులకు, వ్యాపారస్తులకు, ఉద్యోగస్తులకు, కార్మికులకు, రోజువారీ కూలీలకు గతంలో లాగా పని లేకుండా పోయింది. కావున శ్రీ సత్య లయన్స్ క్లబ్ హైదరాబాద్ షేపార్డ్ ఆధ్వర్యంలో సుమారు 150 గ్రామాల పేద ప్రజలకు, వితంతులకు, నిరుపేదలకు నిత్యవసర





సరుకులు పంపిణీ చేస్తూ తమ వంతుగా సహాయం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు, గ్రామాలలో ఉండే పేద ప్రజలు సరిగ్గా తిండి లేక, పేద కుటుంబంలో పుట్టిన కారణంగా వారికి ఎలాంటి ఆదాయ వనరులు లేక ఇబ్బంది పడుతున్న తరుణంలో లయన్స్ క్లబ్ హైదరాబాద్ షెఫర్డ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిడ్స్ అందించి వారికి మనోదయాన్ని కల్పిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలో ఉన్న సుమారు 3000 మంది టీబీ రోగిగస్తులకు రోజు వారి విధంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ షేపార్డ్ ఆధ్వర్యంలో పాలు, పండ్లు, గుడ్లు, విటమిన్స్ కలిగిన వస్తువులు, న్యూట్రిషన్ కిడ్స్ ఆరు నెలలకు సరిపడా అందజేస్తూ మహబూబాబాద్ జిల్లాలో తమ వంతుగా ముందుకు వెళ్తున్నారు. మహబూబా జిల్లా కేంద్రంలో తాసిల్దార్ ఆఫీస్ ఎదురుగా శ్రీ సత్య లయన్స్ చారిటబుల్ ట్రస్ట్ కంటి హాస్పిటల్ ఉచితంగా కాట్రాక్ సర్జరీ చేస్తూ, మానుకోట జిల్లాలో ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వహించుతు తమవంతుగా కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ జగదీశ్వర్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ షెఫర్డ్ చైర్మన్ లయన్ రొయ్యూరు సురేష్, సెక్రటరీ లయన్ డాక్టర్ రెడ్డి నాయక్, శ్రీ సత్య లయన్ చారిటబుల్ ట్రస్ట్ కంటి హాస్పిటల్, బేరా సొసైటీ ప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ మంగలాల్ నాయక్, మాజీ సర్పంచ్ రమేష్ నాయక్, రమేష్, మేనేజర్ బాలునాయక్, మున్సిపాలిటీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## తప్పులతడకతో డీఎస్సీ 2008 ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏజెన్సీ అభ్యర్థుల లిస్టు
# సవరించి మరో లిస్టును ప్రకటించాలి

## ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్, టీఎస్ టిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు.



టేకులపల్లి **(గౌతమ్ న్యూస్):** డీఎస్సీ 2008 ఏజెన్సీ ఏరియాలో 30% డిఎడ్ అభ్యర్థుల వలన నష్టపోయిన బిఎడ్ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని టీఎస్ టిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ కి విన్నవించుకుంటున్న ఏజెన్సీ గిరిజన బి.ఎడ్ అభ్యర్థులు. డ్యూయల్ పోస్టులో ఎంపిక కాబడి అభ్యర్థుల పేర్లను జీవో నెంబర్ 161 రూల్ 15 ప్రకారం తొలగించకపోవడం వలన మాకు తీరని అన్యాయం జరిగిందని తొలగించకపోవడం వల్ల లిస్టులో పేరు రాలేదని వాపోయారు. వాస్తవానికి 30% డీఎడ్ నిబంధన వలన నష్టపోయిన బిఎడ్ అభ్యర్థుల పేర్లను చివరి కట్ ఆఫ్ మార్క్స్ ను నుండి లెక్కించి ఉండి ఉంటే మా పేర్లు లిస్టులో ఉండేవని చెప్పుకొచ్చారు.



ఇప్పటికైనా మా పేర్లను లిస్టులో చేర్చేలా సహాయం చేయాలని టి ఎస్ టి టి ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ గారిని వారి స్వగృహంలో కలిసి అభ్యర్థించగా మీది న్యాయమైన డిమాండ్ వాస్తవానికి 70:30 నిష్పత్తిలో డ్యూయల్ పోస్టు ల్లో ఎంపిక కాబడిన వారిని తొలగించి ఉంటే మీ పేర్లు అప్పటికే లిస్టులో ఉండేవని చెప్పారు. ఖమ్మం జిల్లాలో ఏజెన్సీ ఏరియా గిరిజన అభ్యర్థుల లిస్టు తయారీలో తప్పిదం జరిగిందని, జరిగిన తప్పిదాన్ని గుర్తించేలా అధికారుల దృష్టికి టిఎస్టిటిఎఫ్ యూనియన్ తీసుకెళ్లి మీకు పోస్టింగ్ వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు.ఇప్పటికే ఉమ్మడి ఖమ్మం జిల్లా సైట్ లో ఉంచిన 215 మంది అభ్యర్థులతో ప్రకటించిన లిస్టు తప్పులతడకతో ఉందని చెప్పుకొచ్చారు. ఆ లిస్టులో 70 శాతం టీచర్ ఉద్యోగం చేస్తున్న వారి పేర్లే ఉన్నాయని తెలిపారు.వాస్తవానికి టీచర్ ఉద్యోగ%శీ% రాని పేర్లు ప్రకటించాల్సింది పోయి నామమాత్రంగా లిస్టు ప్రకటించి చేతులు దులిపేసుకున్నట్లు ఉందని వాపోయారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా డీఈఓ గారు నిజంగా నష్టపోయిన లీస్టును శాస్త్రీయబద్ధంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. బి.ఎడ్ ఏజెన్సీ గిరిజన అభ్యర్థులు ఇస్లావత్ లక్ష్మణ్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు భాస్కర్ సత్యం మరియు జనార్ధన్, బుజ్జమ్మ గార్లు పాల్గొనడం జరిగినది.

## నూకల నరేష్ రెడ్డి పార్థివ దేహం పై పూలమాలవేసి నివాళులర్పించిన బయ్యారం సొసైటి చైర్మన్

### ముగిసిన నరేష్ రెడ్డి అంతక్రియలు

### కన్నీటి పర్వతమైన పురుషోత్తయిగూడెం



బయ్యారం(గౌతమ్ న్యూస్): మహబూబాబాద్ జిల్లా రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకుడు మృతుడు నూకల నరేష్ రెడ్డి పార్థివ దేహాన్ని వారి స్వగ్రామం పురోషోత్తాయిగూడెం లో సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించిన బయ్యారం సొసైటి చైర్మన్ మూల మధూకర్ రెడ్డి . అనంతరం అబిషేక్ రెడ్డి వారి కుటుంబసభ్యులకు ధైర్యం కల్పించి ఓదార్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా సుదీర్ఘ రాజకీయం చరిత్ర కలిగిన రాజకీయ దురంధరుడు మృదు స్వభావి స్నేహశీలి అందరినీ ఆదరించే అందరివాడు మనసున్న మారాజు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముసలయ్య , వేల్పుల శ్రీను, రాసమల్ల నాగేశ్వరావు ,తమ్మిశెట్టి వెంకటపతి ,తదితరులు పాల్గొన్నారు.

## తపస్ నార్సింగి మండల నూతన కమిటీ ఎన్నిక

దుబ్బాక ఆర్.సి(గౌతమ్ న్యూస్): మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా: తీగుళ్ల స్వామి ( జడ్.పి.హెచ్.ఎస్ నార్సింగి ),పాతూరి భాస్కర్ రెడ్డి(యుపియస్ శంకాపూర్ )

ఉపాధ్యక్షులుగా: నాగవేందర్ రావు( యుపియస్ జప్తిశివనూరు),ప్రసాద్(జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల నార్సింగి),శివ జ్యోతి ( ఎంపిపియస్ వల్లూరు ) కోశాధికారిగా: నరేష్ గౌడ్ (యుపియస్ నర్సంపల్లి ), కార్యదర్శులుగా:యు.నందు (ఎంపిపియస్ పెద్దతాండ ), స్వామి(యుపియస్ సంకాపూర్),రేఖ(ఎంపిపియస్ చిన్నతండా),రమేష్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్సింగి) సహ కార్యదర్శులు గా: గోపాల్ (యుపియస్ నర్సంపల్లి ), రాజు ( ఎంపిపియస్ శేరిపల్లి ),శ్వేత (ఎంపిపియస్ వల్లూరు ) కార్యవర్గ సభ్యులుగా:సంతోష్ ( జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్సింగి), పద్మశ్రీ(ఎంపిపియస్ నార్సింగి), గీతా(యుపియస్ శంకాపూర్), కళ్యాణి(ఎంపిపియస్ వడ్డెర కాలనీ ),శివ కృష్ణ(ఎంపిపియస్ శేరిపల్లి), పుష్పలత,మాధవి( జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నార్సింగి),యాదగిరి( జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శేరిపల్లి)ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డిఎల్లం చల్లా లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, సంఘం యొక్క రాష్ట్ర, జిల్లా, శాఖ ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయులకు విద్యా రంగానికి అవసరమైన సేవలందిస్తామని వారు అన్నారు.

## ఇటీవల మరణించిన తమ బ్యాచ్ కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలిచిన 2000 బ్యాచ్ కానిస్టేబుళ్లు

### జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ చేతుల మీదుగా 2,00,000/- ల రూపాయల చెక్కును కానిస్టేబుల్ రమణా రెడ్డి కుటుంబానికి అందజేశారు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : ఇటీవల మరణించిన 2000 బ్యాచ్ కి చెందిన కానిస్టేబుల్ రమణారెడ్డి గారి కుటుంబానికి తమ తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు రెండు లక్షల రూపాయలను చెక్కు రూపంలో ఈరోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ గారి చేతుల మీదుగా వారి కుటుంబానికి అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు.తమతో పాటు పోలీస్ శాఖలో భర్తీ అయిన కానిస్టేబుల్ కుటుంబానికి అండగా ఉంటూ ఆర్థికంగా వారికి కొంత సహాయాన్ని అందజేసిన 2000 బ్యాచ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ గారు ఈ సందర్భంగా అభినందించారు.అనంతరం మరణించిన కానిస్టేబుల్ రమణారెడ్డి గారి ప్రస్తుత కుటుంబ పరిస్థితులను ఎస్పీ గారు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు మరియు 2000 బ్యాచ్ నకు చెందిన సుమారు 15 మంది కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

## ఆస్పత్రి వద్ద శానిటేషన్ సిబ్బంది గురువారం నిరసన వ్యక్తం





పోలవరం(గౌతమ్ న్యూస్): బుట్టాయిగూడెం:- శానిటేషన్ సిబ్బంది పెండింగ్ ఆధ్వర్యంలో ఆస్పత్రి వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాత్రింబవళ్లు పారిశుద్ధ్య కార్మికులతో వెట్టి సాకిరి చేయిస్తూ నెలవారి వేతనాలు జమ చేయకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. 6 నెలలుగా జీతాలు వేయకుండా శానిటేషన్ సిబ్బందిని ఇబ్బంది పెట్టడం సరికాదని వెంటనే వారి వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని ఆయన కోరారు. అత్యవసర సేవల్లో భాగమైన శానిటేషన్ కార్మికులను జీతాలు వేయకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదని వెంటనే వారి జీతాలు వారికి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో సీపీఐ పోలవరం నియోజవర్గం కార్యదర్శి కారం దారయ్య, సీపీఐ జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవి రమణ రాజు పాల్గొన్నారు.

## కోలాటం మరియు మ్యాజిక్ షో తో కనువిందు





దుబ్బాక ఆర్.స(గౌతమ్ న్యూస్): చేగుంట మండల కేంద్రం లోని హనుమాన్ దేవాలయం వద్ద అయిత పరంజ్యోతి అమ్మవారి నవరాత్రులు మరియు బతుకమ్మ పండుగ సందర్భంగా హైదరాబాద్ కు చెందిన ప్రముఖ కోలాటం కోచర్ ల తో కోలాట కార్యక్రమం మరియు మ్యాజిక్ షో కూడా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ మహిళా బృందం వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఈ అవకాశం కల్పించిన అయిత పరంజ్యోతి కి కృతజ్ఞతలు కూడా తెలపడం జరిగింది.

# ఘనంగా గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు

### నిర్వహించిన కొత్తగూడెం ఏరియా సింగరేణి జిఎం ఎం. షాలెం రాజు.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(గౌతమ్ న్యూస్): కొత్తగూడెం : కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయము నందు స్వర్గీయులు గడ్డం వెంకటస్వామి జయంతి వేడకను నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా జిఎం షాలెం రాజు మాట్లాడుతూ గడ్డం వెంకటస్వామి గారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉమ్మడిగా ఉన్నప్పుడు వారు భారత పార్లమెంట్ సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ లోని పెద్దపల్లి లోక్ సభ నియోజకవర్గ నుండి ప్రాధాన్యం వహించారు. వారు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యుడు, అలాగే పెద్దపల్లి లోక్ సభ సభ్యుడిగా పెద్దపల్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నప్పుడు వివరించారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యులుగా కూడా వివరించాలని వెంకటస్వామి గారు "కాక" గా అందరికీ సుపరిచితులని తెలియజేశారు. ఆయన భారత స్వతంత్ర సంగ్రామంలో నుండి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఎన్నో లాఠీ దెబ్బలు తట్టుకొని, నిరోధాలు నిర్బంధాలను చవిచూసి తుపాకి గుండ్లకు ఎదురు నిలిచి జైలు గోడలను తరగతి గదులుగా భావించి, కష్టనష్టాలు ఓర్చి పేదలకు పెద్ద దిక్కుగా నిలిచారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదల కోసం 1949లో మొదటిసారి జాతీయ గుడిసెల సంఘం స్థాపించి హైదరాబాద్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన బషీర్ బాగ్ పోరాటాన్ని మూడు లక్షల మందితో నిర్వహించి వేలాది ఎకరాల భూమిని నాలుగు లక్షలకు పైగా నిరుపేద కుటుంబాలకు అందించారని అందుకే వారిని గుడిసెల వెంకటస్వామి అని కూడా పిలిచేవారు అని తెలియజేశారు. సిర్పూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం తదనంతరం ఐఎన్టీయుసీ వైస్ ప్రెసిడెంట్ గా, రాష్ట్ర అధ్యక్షుడిగా, కార్మిక నేతగా నిర్మాణ కార్మికులతో కలిసి పోరాటాలు చేయడం, సిద్ధిపేట నుండి ఎంపీగా గెలిచి తెలంగాణ ఇవ్వాలని పార్లమెంట్ వేదికగా గళం వినిపించారు. జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ సదస్సులో పాల్గొన్నారు. కేంద్ర కార్మిక పునరావాస పౌరసరఫరాల శాఖ సహాయ మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా, పెద్దపల్లి ఎంపీగా గెలిచి కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయమంత్రిగా, కేంద్ర జౌళి శాఖ మంత్రిగా (స్వతంత్ర హోదా) బాధ్యతలు చేపట్టారని అన్నారు. ప్రపంచంలోనే మొదటిసారిగా ప్రైవేట్ కార్మికుల కోసం పెన్షన్ పథకం అమలు చేశారు. అలాగే సింగరేణి కార్మికులతో పెనవేసుకున్న పేగు బంధం కాకాది కార్మికుల కోసం కాకా ఎంతో కష్టపడ్డారని, కార్మికులు కార్మిక ప్రాంత ప్రజలు నేటికీ వారి కుటుంబాన్ని గుండెల్లో పెట్టి చూసుకుంటున్నారని, 1990ల్లో నష్టాల్లో కూరుకుపోయిన సింగరేణి సంస్థ మూతపడే స్థితికి చేరుకుంటున్న సమయంలో కాకా ప్రత్యేక చొరవ చూపి ఎన్టీపీసీ ప్రతినిధులతో మాట్లాడి 400 కోట్ల రూపాయల రుణం అందించడంతో సిరుల మాగాణిగా సింగరేణి నిలిచిందని అన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్‌తో కాకాకు నేరుగా పరిచయం, ఆయన అడుగుజాడల్లో నడిచి వారి మాటలకు అక్షర రూపం ఇస్తూ బడిపిల్లలకు బాసటగా నిలుస్తూ, కళాశాలను నిర్మించి గత ఐదు దశాబ్దాలుగా ఎంతో మందికి ఉచిత విద్యను అందించారని, ఇలా అనునిత్యం పేద ప్రజలకు చేయూత నిచ్చిన కాకా ఎనిమిది పదుల వయస్సులో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చూసి 2014 డిసెంబర్ 22న తుదిశ్వాస విడిచారని అన్నారు. తండ్రి మరణం తర్వాత కూలీగా తన ప్రస్థానం మొదలు పెట్టి 'దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని ప్రజల కోసం పనిచేసి పరితపించిన నేత అని వారు దేశ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న తీరు అందరికీ ఆదర్శం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిఎం తో పాటు ఎస్ ఓ టు జిఎం జి.వి. కోటి రెడ్డి, కొత్తగూడెం ఏరియా ఏఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జై గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఎజిఎం(సివిల్) సిహెచ్ రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) బి. శివ కేశవరావు, పివికె.5 ఇంక్లైన్ ఏజెంట్ బి రవీందర్, డీజీఎం (ఐఈడి) ఎన్.యోహాన్, సీనియర్ పిఓ ఎం. మురళి, ఐటీ మేనేజర్ కే. శేషాశ్రీ జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీలు కే.సౌజన్య, సిహెచ్ సాగర్ మరియు జిఎం కార్యాలయంలోని ఇతర ఉద్యోగులు, అధికారులు పాల్గొన్నారు.

# ఇకపై రోజుకు 2లక్షల 10 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపాలి

### ఓపెన్ కాస్ట్ లో ఉన్న నీటిని పూర్తిగా తొలగించాలి.

### రోజుకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి.

### అన్ని ఏరియాలో జనరల్ మేనేజర్లకు సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ ఆదేశం.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి (గౌతమ్ న్యూస్): సింగరేణి భవన్: వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో నిర్దేశిత వార్షిక ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం కోసం ఇకపై రోజుకు కనీసం రెండు లక్షల పదివేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణా జరపాలని, 15 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ ను తొలగించాలని సింగరేణి సిఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఆదేశించారు .శనివారం మధ్యాహ్నం ఆయన హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, రవాణాపై సమీక్ష నిర్వహించారు . భారీ వర్షాల కారణంగా ఓపెన్ కాస్ట్ గనుల్లో ఇంకా పెద్ద ఎత్తున నిలువ ఉన్న నీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని, అవసరమైతే అదనపు పంపులు వినియోగించాలని ఆదేశించారు. తద్వారా నిర్దేశిత ఓవర్ బర్డన్ తొలగింపు, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. అన్ని ఏరియాల జీఎం లు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే బొగ్గు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, వినియోగదారుల విశ్వాసాన్ని మరింతగా చూరగొనాలని సూచించారు. ఈ ఏడాది ప్రారంభం కావాల్సిన నైనీ బొగ్గు బ్లాక్, వీకే ఓపెన్ కాస్ట్, రొంపేడు ఓపెన్ కాస్ట్, గోలేటి ఓపెన్ కాస్ట్ గనులకు సంభందించి ప్రాథమిక అటవీ పర్యావరణ అనుమతులను సాధించటం జరిగిందని కనుక గనుల ప్రారంభానికి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు ప్రతీ ఏరియా సాధించిన ఉత్పత్తి లక్ష్యాలను సమీక్షించారు. ఇప్పటికే అర్థ సంవత్సరం పూర్తయిన సందర్భంగా మిగిలిన తెరిపి కాలంలో ఇచ్చిన లక్ష్యాలను దాటి ఉత్పత్తులు సాధించాలన్నారు. ఏరియా జనరల్ మేనేజర్లు సూచించిన కొన్ని సమస్యలపై తక్షణమే స్పందిస్తూ వాటి పరిష్కారం కోసం వెంటనే ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు డైరెక్టర్లు డి.సత్యనారాయణ రావు, జి.వెంకటేశ్వర రెడ్డి, జనరల్ మేనేజర్ కోఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని, జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవిప్రసాద్, జనరల్ మేనేజర్ సి. పి. పి. పి.రవికుమార్, అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, వివిధ విభాగాల కార్పొరేట్ జనరల్ మేనేజర్లు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

## యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యం లో 349వ రోజు అన్నదాన కార్యక్రమం




వరంగల్ (గౌతమ్ న్యూస్): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని ఈసీఐఎల్ కాప్రా మున్సిపాలిటీకి చెందిన పైడిపాటి సుబ్బారామ శాస్త్రి ( పెద్ద తాతయ్య ) , మహాలక్ష్మి ( పెద్ద అమ్మమ్మ గార్ల జ్ఞాపకార్థంగా ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం - అంబికా తేజస్విని దంపతుల సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు , హనుమకొండ లో ఉన్న వృద్ధులకు 349వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం - అంబికా తేజస్విని , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవికుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## బోర్డు లేదు.. స్పెసిఫైడ్ అథారిటీ లేదు

### తిరుమల తిరుపతి దేవస్థానంపై చంద్రబాబు నిర్లక్ష్యం

### నెయ్యి, వస్తువుల కొనుగోళ్లకు పర్చేజింగ్ కమిటీ లేదు

### ఎటువంటి కమిటీ లేకనే శ్రీవారి బ్రహ్మోత్సవాలు, కొనుగోళ్లు



తిరుపతి : తిరుమల తిరుపతి దేవస్థానంపై చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులైనా తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి నియామకం జరగలేదు. పాలకమండలి ఆలస్యమైతే వెంటనే స్పెసిఫైడ్ అథారిటీని ఏర్పాటు చేయాలన్నది నిబంధన. దీనిని సీఎం చంద్రబాబు పట్టించుకోలేదు. కనీసం నెయ్యి, ఇతర వస్తువుల పర్చేజింగ్ కమిటీని కూడా నియమించలేదు. ఇవేమీ లేకుండానే శ్రీవారి బ్రహ్మోత్సవాలు, కొనుగోళ్లు జరిగిపోతున్నాయి. ప్రస్తుతం బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. పాలక మండలి, కనీసం స్పెసిఫైడ్ అథారిటీ లేక తిరుమలపై భక్తుల సౌకర్యాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎటువంటి కమిటీ లేకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించడం టీటీడీ చరిత్రలో ఇదే మొదటిసారి. ఇంత నిర్లక్ష్యమా అంటూ బాబు సర్కారుపై భక్తులు మండిపడుతున్నారు.కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు తిరుమల వచ్చారు. వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు చేశారు. నాడు అవినీతి, అక్రమాలు జరిగాయని, ప్రక్షాళన టీటీడీ నుంచే ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. అయినా ఇంతవరకు సరైన పాలన వ్యవస్థనే ఏర్పాటు చేయలేకపోయారు. నిత్యం వేలాది భక్తులు, కోట్ల రూపాయల్లో ఆదాయం ఉండే టీటీడీలో ఏ వస్తువు కొనాలన్నా పాలక మండలి ఆమోదం, పర్చేజింగ్ కమిటీ అనుమతులు తప్పనిసరి. పర్చేజింగ్ కమిటీలో మార్కెటింగ్ అధికారి, ఫైనాన్స్ అడ్వైజర్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏ అండ్ సీఏఓ), జేఈవో, బోర్డు మెంబర్లు ఉంటారు. నెయ్యి వివాదం నేపథ్యంలో ఈ కమిటీ అత్యవసరం కూడా. అయితే మూడు నెలలుగా బోర్డు, పర్చేజింగ్ కమిటీ రెండూ లేవు. కనీసం ఉన్నతాధికారులతో కూడిన స్పెసిఫైడ్ అథారిటీ కూడా లేదు.

## రుణమాఫీకి తెలంగాణ రైతుల ఎదురుచూపు



### బూటకపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్

### మహారాష్ట్రలో ప్రధాని మోదీ విమర్శ

ముంబై, : తెలంగాణలో రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీ ఇచ్చిందని, ఈనాటికీ అక్కడ రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. కర్ణాటకలో బీజేపీ హయాంలో చేపట్టిన నీటిపారుదల పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. శనివారం మహారాష్ట్రలోని వాషిం జిల్లాలో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖకు సంబంధించి రూ.23,300కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులకు, ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఉద్దేశించిన సొమ్ములో అవినీతికి పాల్పడుతున్నాయని, రైతుల జీవితాలను దుర్భరం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెసను 'అర్బన్ నక్సల్స్ ముఠా' నడుపుతోందని, ప్రజలు ఐక్యంగా ఉండి ఆ పార్టీ ప్రమాదకర ఎజెండాను తిప్పికొట్టాలన్నారు. బ్రిటిష్ ప్రభుత్వం బంజారాలను వేధించిందని, బ్రిటీషర్లు దేశాన్ని వదిలివెళ్లిపోయిన తర్వాత ఆ వేధింపులను కాంగ్రెస్ కొనసాగించందన్నారు. బంజారాలను ప్రధాన ప్రవంతిలోకిరాకుండా అడ్డుకుందన్నారు. వాషిం జిల్లాలోని పోహరాదేవి గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకున్న బంజారా విరాసత్ మ్యూజియం భవిష్యత్తుతరాలకు బంజారా సమాజం గొప్ప సంస్కృతిని పరిచయం చేస్తుందన్నారు. ఆ గ్రామంలోని జగదాంబ మాత ఆలయాన్ని మోదీ సందర్శించి పూజలు చేశారు. సంత్ సేవాలాల్ మహారాజ్, సంత్ రామారావు మహారాజ్ సమాధులను సందర్శించి నివాళి అర్పించారు. కాగా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ విడత కింద 9.5కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ.20వేల కోట్లను ప్రధాని బదిలీ చేశారు.

## తీపి కబురు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి..

### సంచలన నిర్ణయానికి జై!



2023 ఎన్నికల్లో కాంగ్రెస్ విజయవంతంగా అధికారంలోకి వచ్చాక.. ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంటోంది. హైదరాబాద్‌లో అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపాలని హైడ్రా తీసుకువచ్చింది. అలాగే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టడం ఇందులో ఓ భాగం అంటూ ప్రభుత్వం వెల్లడించింది. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఇప్పటికే సర్వే పూర్తి చేసి, తొలగించాల్సిన ఇండ్లను గుర్తించారు. అయితే, ఈ చర్యలు పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై ప్రభావం చూపుతాయని ప్రతిపక్షాలు, ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇళ్ల కూల్చివేతలతో ప్రజలు రోడ్డుపై పడతారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం కీలక నిర్ణయం తీసుకుంది. దీనికి ప్రత్యేకంగా 14 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసి, సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్‌ను కమిటీ చైర్మన్‌గా నియమించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఈ కమిటీలో బీఆర్ఎస్, బీజేపీ, ప్రభుత్వం సభ్యులుగా చర్చలు జరిపి, నిర్వాసితులకు న్యాయం చేయాలని నిర్ణయించారు. పేదలకు నివాసం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా, రేసు కోర్టును నగర శివారులకు తరలించి, అక్కడ ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలన్న ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అంబర్ పేటలో ఉన్న పోలీస్ అకాడమీని కూడా మరో ప్రాంతానికి తరలించి, ఆ భూమిని పేదలకు ఉపయోగపడేలా చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీ నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగించారు.

## నితీష్‌కుమార్‌కు భారతరత్న డిమాండ్..

### బీహార్‌లో వెలసిన పోస్టర్లు



**న్యూఢిల్లీ,:** బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీష్‌కుమార్‌కు భారతరత్న ఇవ్వాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. ప్రస్తుతం మోడీ 3.0 ప్రభుత్వంలో జేడీయూ కీలక పాత్ర పోషిస్తోంది. పైగా త్వరలోనే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో నితీష్ కుమార్‌కు భారతరత్న ఇవ్వాలంటూ పాట్నా నగరమంతా జేడీయూ శ్రేణులు పోస్టర్లు అంటించారు. భారతరత్నకు నితీష్ కుమార్ అర్హులని పోస్టర్లలో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే 2024 లోక్‌సభ ఎన్నికల ముందు దివంగత నేత, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు మోడీ సర్కార్ భారతరత్న ఇచ్చింది. దీంతో కొన్ని వర్గాల నుంచి సానుభూతి ఓట్లను రాబట్టుకున్నారు. త్వరలో బీహార్‌లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ ఆర్జేడీ గట్టి పోటీ ఇస్తుంది. అంతేకాకుండా ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కూడా కొత్త పార్టీ స్థాపించారు. అంటే ఈసారి ఎన్నికల్లో రసవత్తర పోటీనే ఉండనుంది. మరోసారి అధికారం కోసం జేడీయూ ఎత్తుగడలు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటినుంచే ప్రణాళికలు వేస్తోంది. ఇందులో భాగంగానే భారతరత్న డిమాండ్ తెరపైకి వచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నితీష్ కుమార్ సుదీర్ఘ కాలం రాష్ట్రానికి సేవలందించారని.. రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గట్టెక్కాలంటే సముచిత గౌరవాన్ని ఇవ్వాలని జేడీయూ నాయకుడు వ్యాఖ్యానించారు. నితీష్.. భారతరత్నకు పూర్తి అర్హుడని చెప్పుకొచ్చారు. వాజ్‌పేయ్ హయాంలో కేంద్రమంత్రిగా నితీష్ సేవలందించారని గుర్తుచేశారు. ఆయన భారత రత్న పురస్కారాన్ని స్వీకరించేందుకు వీటితో పాటు మరెన్నో కారణాలు ఉన్నాయని జేడీయూ పార్టీ పేర్కొంది. ఇక జేడీయూ పోస్టర్లపై ఆర్జేడీ తీవ్ర విమర్శలు గుప్పించింది. సీఎం కుర్చీని ఖాళీ చేయాలంటూ నితీష్‌పై బీజేపీ ఒత్తిడి తెస్తోందని ఆరోపించింది.

## తెలంగాణలో మూడురోజులు వర్షాలు.. ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మూడు రోజుల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం పశ్చిమ-మధ్య దక్షిణ బంగాళాఖాతం వద్ద సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ. ఎత్తులో ఏర్పడిన ఆవర్తనం.. ఇవాళ పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి చేరువగా సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ. నుంచి 4.5 కి.మీ మధ్యలో కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ఈ ప్రభావంతో తెలంగాణలోకి పశ్చిమ, వాయువ్య దిశ నుంచి గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో శనివారం జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు పడే అవకాశం ఉందని చెప్పింది. సోమవారం ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.ు

## చిన్నప్పుడే ఎంజీఆర్‌ను కలిశా



**అమరావతి,:** సనాతన ధర్మ పరిరక్షణపై జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశం అయ్యాయి. అక్కడ అధికారంలో ఉన్న డీఎంకే యువజన విభాగం అధినేత, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించడం పట్ల తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొనాల్సి వచ్చిందాయనకు. గతంలో సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. డెంగ్యూ, మలేరియా తరహాలోనే సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాల్సిన అవసరం ఉందంటూ ఓ సమావేశంలో బహిరంగంగా విమర్శలు చేశారు. అప్పట్లో నిరసనలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అవే వ్యాఖ్యలను పవన్ కల్యాణ్ ఇటీవలే తిరుపతిలో నిర్వహించిన వారాహి సభలో ప్రస్తావించారు. ఎక్కడా ఉదయనిధి స్టాలిన్ పేరు ఎత్తకుండా విమర్శలు గుప్పించారు. ఫలితంగా డీఎంకే నుంచి ఎదురుదాడిని ఎదుర్కొనాల్సి వచ్చింది పవన్ కల్యాణ్‌కు. దీనిపై ఉదయనిధి సైతం స్పందించారు. ఈ పరిస్థితుల మధ్య డీఎంకే రాజకీయ ప్రత్యర్థి పార్టీ ఏఐఏడీఎంకేకు మద్దతుగా ఓ ట్వీట్ పోస్ట్ చేయడం చర్చనీయాంశమౌతోంది. తన వ్యక్తిగత ఎక్స్ అకౌంట్ హ్యాండిల్ నుంచి పోస్ట్ పెట్టారు. ఈ నెల 17వ తేదీన 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకొంటోన్న ఏఐఏడీఎంకేకు శుభాకాంక్షలు చెప్పడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అన్నా డీఎంకే వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎం జీ రామచంద్రన్‌పై ఆసియా వీక్ ప్రచురించిన కవర్ పేజీ ఫొటోను తన ట్వీట్‌కు జత చేశారు పవన్ కల్యాణ్. పురచ్చి తలైవాగా అభివర్ణించారు. తన బాల్యం చెన్నైలో గడిచిందని, అప్పట్లో ఎంజీఆర్ నుంచి స్ఫూర్తి పొందానని వ్యాఖ్యానించారు. చెన్నై మైలాపూర్‌లో చదువుకుంటోన్నప్పుడు తమిళ ఉపాధ్యాయుడి ద్వారా ఎంజీఆర్‌ను కలిశానని పవన్ కల్యాణ్ గుర్తు చేసుకున్నారు. తిరుక్కురల్ నుంచి తీసుకున్న వాక్యాలను ట్వీట్‌లో పొందుపరిచారు. పరోపకారం, క్షమాగుణం, నిష్కల్మషం, ప్రజల పట్ల శ్రద్ధ ఉన్న వాళ్లే రాజులా వెలుగొందుతారనే అర్థం వచ్చే వాక్యాలవి.

## 'డ్రగ్స్ సొమ్ముతో ఎన్నికల్లో పోటీ..' కాంగ్రెస్‌పై మోదీ ఆరోపణలు



ముంబయి: ప్రధాని నరేంద్రమోదీ కాంగ్రెస్ పార్టీపై మండిపడ్డారు. డ్రగ్స్ సొమ్ముతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేస్తోందని విమర్శించారు. ఇటీవల దిల్లీలో రూ.వేల కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత కేసులో ఓ కాంగ్రెస్ నేత ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం మహారాష్ట్రలోని వాసింలో నిర్వహించిన సభలో పాల్గొన్న ప్రధాని ఈ డ్రగ్స్ కేసు గురించి ప్రస్తావించారు. యువతను కాంగ్రెస్ పార్టీ మాదకద్రవ్యాల వైపు నెట్టి.. ఆ సొమ్ముతో ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని భావిస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్‌ను అర్బన్ నక్సల్స్ ముఠా పాలిస్తోందని..ఆ పార్టీ ప్రమాదకరమైన అజెండాను ఓడించేందుకు ప్రజలంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తులతో కాంగ్రెస్ ఎంత సన్నిహితంగా ఉంటుందో ప్రజలు గమనించాలని అన్నారు. బ్రిటిష్ పాలకుల మాదిరిగా కాంగ్రెస్ కూడా దళితులు, వెనుకబడిన వర్గాలు, గిరిజనులను తమతో సమానంగా పరిగణించదని దుయ్యబట్టారు. భారతదేశాన్ని ఎప్పటికీ ఒకే కుటుంబం పాలించాలని వారు భావిస్తారని ఆరోపించారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ స్థానికంగా ఉన్న జగదాంబ మాత ఆలయంలో పూజలు చేశారు. అనంతరం సంత్ సేవా లాల్ మహారాజ్ సమాధి వద్దకు వెళ్లి సంప్రదాయ ఢంకా వాయించారు. బంజారా విరాసత్ మ్యూజియాన్ని ప్రారంభించారు. అంతే కాకుండా ముంబయిలో మొట్టమొదటి భూగర్భ మెట్రో లైన్‌ను ప్రారంభించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 18వ విడత నిధులు విడుదల చేశారు. దీని ద్వారా సుమారు 9.4 కోట్ల మంది రైతులకు సుమారు రూ.20,000 కోట్ల సహాయం అందింది.

# నాణ్యమైన ప్రభుత్వ విద్య అవసరం!



"ఉపాధ్యాయుల హోదా పెంచడానికి, వారి హక్కులు, బాధ్యతలకు సంబంధించి" కొన్ని నిర్దిష్టమైన సిఫార్సులతో సమగ్రమైన పత్రాన్ని ఆమోదించిన ఐక్యరాజ్యసమితి అక్టోబర్ 5వ తేదీని "ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం'గా ప్రకటించింది. "స్టేటస్ ఆఫ్ ది టీచర్స్" పై యునెస్కో 1966 అక్టోబర్ లో 13 చాప్టర్లతో , 146 అంశాలతో కూడిన విధాన పత్రాన్ని ఆమోదించింది. అయితే ఉపాధ్యాయ అంతస్తు సాధనకు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయులు ఉద్యమించవలసి వస్తోంది.

### బోధనకు ఆటంకం కలగకుండా..

ఉపాధ్యాయులకు వారి కుటుంబ అవసరాలు, ఉన్నత జీవన స్థాయి, మార్కెట్లో నిత్యావసరాల ధరల సూచీలు, ఉన్నత విద్యార్హతలు పొందడానికి అయ్యే ఖర్చులు, పరిగణనలోకి తీసుకొని గౌరవప్రదమైన జీవన వేతనాలను నిర్ణయించాలని, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి వేతన స్కేళ్ళను రూపొందించాలని, తాత్కాలిక ఉపాధ్యాయులకు కూడా శాశ్వత ఉపాధ్యాయుల కన్నా తక్కువ వేతనాలు ఇవ్వకూడదని, వేతనాలు నిర్ణయించడంలో ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనకుండా చూడాలని, వార్షిక వేతనాభివృద్ధితో పాటు అప్రయత్న పదోన్నతి స్కేళ్ళను కూడా ఇవ్వాలని యునెస్కో తీర్మానించింది. ప్రతిభ ప్రాతిపదికన వేతనాలు నిర్ణయించకూడదని, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ ఉండే విధంగా తరగతి గదిలో విద్యార్థుల సంఖ్య నిర్ణయించాలని, ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలగకుండా బోధనేతర సిబ్బందిని నియమించాలని, ఉపాధ్యాయులకు బోధనోపకరణాలను ప్రభుత్వమే సమకూర్చాలని కూడా తీర్మానించింది. అయితే ఈ బోధనోపకరణాలు ఉపాధ్యాయునికి ప్రత్యామ్నాయం కారాదని స్పష్టంగా తెలిపింది. ఉపాధ్యాయుల పని భారం నిర్ణయించడంలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు, సలహాలు పాటించాలని, ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం మానసిక, శారీరక విశ్రాంతి లభించే విధంగా సెలవులు ఇవ్వాలని, పై చదువులు చదువుకోవడానికి, అనారోగ్యానికి ప్రత్యేకంగా సెలవులు ఇవ్వాలని కూడా తీర్మానం పేర్కొంది.

### టీచర్ హోదా క్షీణిస్తోంది

కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ అధ్యయనం ప్రకారం 1990 నుంచే ఉపాధ్యాయుని హోదా క్షీణించడం ప్రారంభమైందని, ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించడానికి యువత అనాసక్తతను ప్రదర్శిస్తోందని, పాఠశాలలు, ఉపాధ్యాయులపై నియంత్రణ అధికమై స్వేచ్ఛాయుత వాతావరణంలో బోధన జరుపలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని, "ఉపాధ్యాయ వృత్తి ఎంత గౌరవప్రదమని భావించినప్పటికీ" వారికి తక్కువ ప్రతిఫలం లభిస్తోందని, ఫలితంగా ఈ వృత్తిని ఉపాధ్యాయులు సంతృప్తికరంగా సమాజం భావించిన విధంగా నిర్వహించలేకపోతున్నారని తెలుస్తోంది.

### వేతనాల చెల్లింపులో వివక్ష

తాత్కాలిక, శాశ్వత ఉపాధ్యాయుల మధ్య వేతనాలలో వివక్ష ఉండరాదని యునెస్కో చెప్పింది. సుప్రీంకోర్టు కూడా ఒకే రకమైన పనికి ఒకే వేతనం ఉండాలని గతంలో తీర్పు చెప్పింది. అయినా మన దేశంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా తక్కువ వేతనంతో పనిచేసే ఉపాధ్యాయులు విద్యావ్యవస్థలో ఉన్నారు. పెట్టుబడిదారుల, పాలకుల కనుసన్నల్లో నడిచే ఐక్యరాజ్యసమితి, యునెస్కో ఉపాధ్యాయుల హోదా అంతస్తు వేతనాల చెల్లింపులో వివక్షత పట్ల వ్యూహాత్మకంగా మౌనం పాటిస్తున్నాయి. పారా టీచర్లు, గెస్ట్ టీచర్లు, కాంట్రాక్టు టీచర్లు, విద్యా వాలంటీర్లు, అకడమిక్ కన్సల్టెంట్లు ... పేరు ఏదైనా కావచ్చు! ఉపాధ్యాయులు చట్టబద్ధమైన దోపిడీకి గురవుతున్నారు. పైన తెలిపిన అంశాలు ఏవి కూడా నూతన జాతీయ విద్యా విధానంపై చర్చించలేదు. పైగా ఉపాధ్యాయులను "హైర్" చేసుకోవాలనే కొత్త భావనను జాతీయ విద్యా విధానం ముందుకు తెచ్చింది. కొఠారి కమిషన్ ఉపాధ్యాయ వృత్తిలోకి సమాజంలోని అత్యంత ప్రతిభావంతులైన యువకులను ఆకర్షించడానికి అధిక వేతన విధానం మెరుగైన పని పరిస్థితులు సర్వీస్ కండిషన్లను రూపొందించాలనే సిఫార్సులను నూతన జాతీయ విద్యా విధానం గమనంలోకి తీసుకోలేదు. అంతే కాకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు సీనియార్టీ ప్రకారం కాకుండా ప్రతిభ ప్రాతిపదికన ఇవ్వాలనే ఉపాధ్యాయ వ్యతిరేక సూచనలు చేసింది.

### అప్పుడే నాణ్యమైన విద్య!

విద్యారంగానికి ప్రభుత్వ నిధులను పెద్ద ఎత్తున కేటాయిస్తూ, యునెస్కో విధాన పత్రం ప్రాతిపదికన ఉపాధ్యాయుల హోదా, అంతస్తు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటూ ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాలి. ప్రభుత్వ రంగంలో విద్యావ్యవస్థ నడిచేలా చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే ప్రజలందరికీ నాణ్యమైన, సమానమైన విద్య అందించగలుగుతాం. అదే నినాదంతో యునెస్కో, ఐక్యరాజ్యసమితి, ఎడ్యుకేషనల్ ఇంటర్నేషనల్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ సారి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని నిర్ణయించాయి.

# ఉద్యోగులు.. వివిధ రకాల సెలవులు



ఉమ్మడి మద్రాసు రాష్ట్రం రూపొందించిన సెలవు నిబంధనలే కొద్దిపాటి మార్పులు సవరణలతో ఆంధ్రప్రదేశ్ సెలవు నిబంధనలు 1933గా అమల్లోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ సెలవు నిబంధనల్లో మూడు రకాల సెలవు నిబంధనలు మాత్రమే.. పేర్కొన్నారు. అవి సంపాదిత సెలవు, అర్ధ జీతం సెలవు, జీత నష్టపు సెలవులు. కొన్ని ప్రత్యేక సందర్భాలలో అనుమతించే సెలవుల గురించి ప్రాథమిక నిబంధనలో పొందుపరిచారు. ఈ ఆంధ్రప్రదేశ్ సెలవు నిబంధనలనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అడాప్ట్ చేసుకోవడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు ఇవే సెలవులు కనుక ఉద్యోగులకు అనుమతించిన వివిధ రకాల సెలవుల గురించి తెలుసుకుందాం.

ఆకస్మిక సెలవు: ప్రతి ఉద్యోగి దీన్ని ఒక సంవత్సరంలో 15 రోజులు వినియోగించుకోవచ్చు. ఆదివారాలు ఇతర సెలవు దినాలతో కలుపుకొని 10 రోజులకు మించకుండా తీసుకోవచ్చని అనుమతించారు.

ఐచ్ఛిక సెలవులు: ప్రతి ఉద్యోగికి సంవత్సరానికి ఐదు రోజులు ఐచ్ఛిక సెలవులు లభిస్తాయి. ఆకస్మిక, ప్రత్యేక ఆకస్మిక, ఐచ్ఛిక సెలవులు ఆ సంవత్సరంలోనే వినియోగించుకోవాలి. ఐచ్ఛిక సెలవు మరుసటి సంవత్సరానికి నిల్వ ఉండదు.

ప్రత్యేక ఆకస్మిక సెలవులు: వెకేషన్ డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రతి సంవత్సరం 7 రోజుల వరకు వీటిని అనుమతిస్తారు. ఉద్యోగులైన స్త్రీలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సకు 14 రోజులు, గర్భవిచ్ఛిత్తి,(%మీూ%)కి 14 రోజులు, రీకానలైజేషన్ కోసం గరిష్టంగా 21 రోజులు, అలాగే గర్భనిరోధక సాధనం లూప్ అమర్చుకున్న, తీసివేసిన రోజు మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగా ఒకరోజు మంజూరు చేస్తారు. ఉద్యోగులకు వేసక్టమీకి ఆరు రోజులు, భార్య ట్యూబెక్టమీ చేయించుకున్న సందర్భంలో ఏడు రోజులు అనుమతిస్తారు. పై సెలవులన్నీ ఇద్దరి కంటే తక్కువ సంతానం కలిగి ఉన్న పరిస్థితుల్లో మాత్రమే వర్తిస్తాయి. రక్తదానం చేసిన ఉద్యోగికి ఒకరోజు ప్రత్యేక సెలవు ఇవ్వబడుతుంది. అలాగే జాతీయ అంతర్జాతీయ క్రీడల్లో ఎన్నికై పాల్గొనడానికి 30 రోజులు, ప్రభుత్వ గుర్తింపు కలిగిన సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో సభ్యత్వం కలిగిన వివిధ శాఖల ఆఫీస్ బేరర్స్‌కు సంఘ కార్యకలాపాలకు హాజరయ్యే నిమిత్తం 21 రోజుల వరకు అనుమతిస్తారు.

సంపాదిత సెలవు: నాన్ వెకేషన్ డిపార్ట్మెంట్ పర్మినెంట్ ఉద్యోగులకు ఒక సంవత్సరంలో 30 రోజులకు మించకుండా జనవరి ఒకటిన 15 రోజులు, జులై 1న 15 రోజులు వారి ఖాతాకు జమ చేస్తారు. వెకేషన్ డిపార్ట్మెంట్ పర్మినెంట్ ఉద్యోగులకు సంవత్సరంలో ఆరు రోజులు అనగా జనవరి 1న 3 రోజులు, జూలై 1న 3 రోజులు అడ్వాన్స్‌గా జమ చేయబడతాయి. ఈ సెలవును గరిష్టంగా 300 రోజుల వరకు ఖాతాలో నిలువ ఉంచుకోవచ్చు. ఈ సెలవును 120 రోజులకు మించకుండా ఒకేసారి వాడుకోరాదు. ఉద్యోగి జీత నష్టపు సెలవులో ఉన్నట్లయితే సదరు కాలానికి సంపాదిత సెలవు జమ చేయరు. పర్మినెంట్ కానీ ఉద్యోగులకు సంవత్సరానికి 15 రోజులు అట్లే వెకేషన్ డిపార్ట్మెంట్ వారికి మూడు రోజుల చొప్పున మాత్రమే సెలవు ఖాతాలో జమ చేయవలసి ఉంటుంది. పర్మినెంట్ అయిన తర్వాత సంపాదిత సెలవును రీకాస్ట్ చేసి అర్హత ప్రకారం జమ చేస్తారు. ఈ సంపాదిత సెలవునే ప్రతి ఉద్యోగి ఒక సంవత్సరంలో 15 రోజులు కానీ, రెండు సంవత్సరాల విరామంతో 30 రోజుల వరకు సరెండర్ చేసి వాటికి సరిపడు జీతభత్యాలను పొందవచ్చు. అలాగే 300 రోజుల గరిష్ట పరిమితికి లోబడి ఉద్యోగి పదవీ విరమణ చేసే సమయంలో నగదుగా మార్చుకోవచ్చు. ఉద్యోగి సర్వీసులో ఉండి మరణిస్తే గరిష్టంగా 300 రోజులు నగదుగా మార్చుకునే సదుపాయం ఉంది.

అర్ధ జీతపు సెలవు: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ప్రతి సంవత్సర కాల సర్వీసుకు 20 రోజులు చొప్పున అర్ధ జీతపు సెలవు లభిస్తుంది. ఉద్యోగి జీతం నష్టపు సెలవుల్లో ఉన్నా ఈ సెలవును జమ చేస్తారు. సెలవు ఖాతాకు గరిష్ట పరిమితి లేదు. ఈ సెలవును వ్యక్తిగత కారణాలపై లేదా వైద్య కారణాలపై వినియోగించుకోవచ్చు. వైద్య కారణాలపై ఈ సెలవును వినియోగించుకుంటే కమ్యుటెడ్ సెలవు అంటారు. ఈ సెలవును సర్వీస్ మొత్తంలో ఉద్యోగి 240 రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు. అర్ధ జీతపు సెలవుపై జీతభత్యాలు అలవెన్సులు సగం మాత్రమే లభిస్తాయి. వైద్య కారణాలపై తీసుకున్న సెలవుపై పూర్తి జీతభత్యాలు పొందవచ్చు.

లీవ్ నాట్ డ్యూ: సంపాదిత సెలవు కానీ, అర్ధజీతపు సెలవు కానీ ఉద్యోగి లేనప్పుడు ఈ లీవ్‌ను మంజూరు చేసే అధికారి ఉద్యోగి మొత్తం సర్వీసులో 6 నెలలకు మించకుండా కొన్ని పరిమితులకు లోబడి లీవ్ నాట్ డ్యూ మంజూరు చేయవచ్చు. ఈ సెలవును భవిష్యత్తులో సంపాదిం చే అర్ధ జీతపు సెలవు నుంచి తీసివేస్తారు. ఇది మెడికల్ సర్టిఫికెట్ పైనే మంజూరు చేస్తారు.

ప్రసూతి సెలవు: ప్రతి మహిళా ఉద్యోగికి 180 రోజులు, అట్లే అబార్షన్ కోసం ఆరు వారాల సెలవును మంజూరు చేస్తారు. ఈ సెలవు కాలంలో పూర్తి జీతభత్యాలు చెల్లిస్తారు. ఈ ప్రసూతి సెలవుకు ఇద్దరి కంటే తక్కువ పిల్లలు ఉన్న వారే అర్హులు. ఇట్టి సెలవును మెడికల్ సర్టిఫికెట్‌పై మాత్రమే మంజూరు చేస్తారు.

పితృత్వ సెలవు: భార్య ప్రసవిస్తే భర్తకు 15 రోజుల పితృత్వ సెలవులు మంజూరు చేయవచ్చు. ఇద్దరు కంటే తక్కువ పిల్లలు కలిగిన వారికి అర్హత ఉంది. ఈ సెలవు 16 - 9 - 2005 నుంచి మాత్రమే అమలులో ఉంది. ఈ సెలవును ప్రసూతి అయిన తేదీ నుంచి మాత్రమే అనుమతిస్తారు.

జీత నష్టపు సెలవు: ఉద్యోగికి ఏ రకమైన సెలవు ఖాతాలో లేనప్పుడు ఈ సెలవును లేదా సెలవు ఉన్నప్పటికీ ఉద్యోగి తాను స్వయంగా ఈ సెలవును మంజూరు చేయమని కోరినప్పుడు అనుమతించవచ్చు. ఈ సెలవు కాలానికి జీతభత్యాలు సాధారణంగా చెల్లించరు. కానీ దీర్ఘకాల వ్యాధులైన టీబీ, కుష్టు, క్యాన్సర్, మానసిక, గుండె, మూత్రపిండాల జబ్బుల చికిత్స నిమిత్తం ఈ సెలవును వినియోగించుకుంటే వారికి ఎక్స్‌గ్రేషియా అలవెన్స్ చెల్లిస్తారు. సాధారణంగా జీత నష్టపు సెలవుకాలం ఇంక్రిమెం ట్ పొందేందుకు, పెన్షన్‌కు పరిగణించబడదు. కానీ ఈ సెలవు వైద్య కారణాలపై తీసుకున్నట్లయితే పరిమితి లేకుండా, అలాగే వ్యక్తిగత కారణాలపై వినియోగించుకున్నట్లయితే మూడేళ్ల వరకు పెన్షన్‌కి లెక్కిస్తారు. వైద్య కారణాలపై ఆరు నెలల జీతం నష్టం సెలవు కాలాన్ని ఇంక్రిమెంట్‌కు పరిగణించేందుకు శాఖ అధికారి అనుమతించవచ్చు. ఆరు నెలలపై కాలానికి ప్రభుత్వానికి మాత్రమే అధికారం ఉంది. జీతం నష్టం సెలవు కాలాన్ని ఇంక్రిమెంట్లకు పరిగణించేందుకు పై అధికారులకు ప్రతిపాదనలు పంపే బాధ్యత లీవు మంజూరు చేసే అధికారి పైనే ఉంటుంది.

ప్రత్యేక డిసేబిలిటీ లీవు : ప్రాథమిక నిబంధనలు 83ను అనుసరించి ఏదేని ప్రభుత్వ ఉద్యోగి తన విధి నిర్వహణలో ప్రమాదం సంభవించి అశక్తుడైన పక్షంలో 24 నెలలకు మించకుండా ఈ సెలవును పరిమితులకు లోబడి మంజూరు చేయవచ్చు. సెలవు మంజూరు చేసే అధికారం ప్రభుత్వానికి మాత్రమే ఉంటుంది. ఈ సెలవులో మొదటి నాలుగు నెలల కాలానికి పూర్తి జీతం తదుపరి కాలానికి సగం జీతం చెల్లిస్తారు. గెజిటెడ్ ఉద్యోగులు, మెడికల్ బోర్డు వారి, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు సివిల్ సర్జన్ ధృవీకరించబడిన సర్టిఫికెట్ ఉంటేనే ఈ సెలవును మంజూరు చేస్తారు.

హాస్పిటల్ లీవ్: ప్రాథమిక నిబంధనలు 101బి ప్రకారం పర్మనెంట్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ ఉద్యోగులకు కొన్ని వర్గాల వారికి, క్రింది శ్రేణి వారికి అంటే పోలీస్ కానిస్టేబుల్, జైల్ మెట్రిన్, ఫారెస్ట్ గార్డ్, పశుసంవర్ధక శాఖలో పనిచేసే కొన్ని వర్గాల ఉద్యోగులకు మాత్రమే ఈ సెలవుకు అర్హత ఉంటుంది. ప్రతి మూడేళ్లకోసారి ఆరు నెలలకు మించకుండా సెలవు అర్హత కలదు. విధి నిర్వహణలో భాగంగా సంక్రమించిన వ్యాధులకు అలాగే విధినిర్వహణలో ప్రమాదం సంభవించిన కారణాలపై ఈ సెలవును మంజూరు చేస్తారు. ఈ సెలవు కాలానికి సగటు జీతం లభిస్తుంది.

స్టడీ లీవ్ : ప్రాథమిక నిబంధన 84 ప్రకారం 5 సంవత్సరాల కనీస సర్వీస్ కలిగిన ప్రభుత్వ ఉద్యోగులకు పరిమితులకు లోబడి రెండేళ్లకు మించకుండా సర్వీస్ నందు ఒకసారి మాత్రమే అనుమతిస్తారు. ఈ సెలవు కాలంలో జీతాన్ని ప్రాథమిక నిబంధనలను అనుసరించి కనిష్ట గరిష్ట పరిమితులకు లోబడి పొందవచ్చు.

కంపెన్సేటరీ క్యాజువల్ లీవ్ : ప్రభుత్వ ఉద్యోగి సెలవు దినంలో పని చేసినట్లయితే ఈ సెలవుకు అర్హులు. పర్యవేక్షకుల కంటే తక్కువ స్థాయి ఉద్యోగులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. ఒక సంవత్సరంలో పది రోజులకు మించకుండా వాడుకోవచ్చు. ఉద్యోగి పనిచేసిన దినం నుంచి ఆరు నెలలలోపు ఈ సెలవులు వినియోగించుకోవాలి.

చైల్డ్ కేర్ లీవ్: పిల్లల సంరక్షణ చూసుకోవడానికి 90 రోజుల చైల్డ్ కేర్ లీవ్‌ను ప్రభుత్వం జీవో 209 ఫైనాన్స్ డిపార్ట్మెంట్ తేదీ 21 -11 -2016 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఇట్టి సెలవును ఇద్దరు పిల్లల సంరక్షణ సందర్భంలో ఒకే దఫా 15 రోజులకు మించకుండా తీసుకోవచ్చును. పిల్లలు 18 సంవత్సరాల వయసు వచ్చు వరకు, అందవైకల్యం ఉన్న పిల్లల విషయంలో వారికి 22 సంవత్సరాల లోపల ఇట్టి సెలవును వినియోగించుకోవచ్చు.

# ఈ పోరులో అవమానమెవరికి!



బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న కొండా సురేఖ కేటీఆర్‌ని టార్గెట్ చేస్తూ సినీనటి గురించి చేసిన వ్యాఖ్యలు పేర్కొనడానికి కూడా వీలులేనంత జుగుప్సాకరంగా ఉన్నాయి. దీనిపై రాజకీయ, సినీ రంగం నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఆమె స్పందించి. నటి సమంతపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే ఇదే సమయంలో దర్శకుడు రాం గోపాల్ వర్మ చేసిన ట్వీట్ అందరినీ ఆలోచనలో పడేసింది. 'కొండా సురేఖ సమంతకి క్షమాపణలు చెప్పడమేమిటి? ఆమె అత్యంత జుగుప్సాకరంగా అవమానించింది నాగార్జున, నాగచైతన్యని. ఇది సమంతను అవమానించడం ఎలా అయింది? వాళ్లిద్దరి కోసమే కాకుండా ఫిలిమ్ ఇండస్ట్రీలో ఉండే అందరి కోసం ఈ విషయాన్ని నాగార్జున, నాగ చైతన్య చాలా సీరియస్‌గా తీసుకొని మరిచిపోలేని గుణపాఠం చెప్పాలి' అని వర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆయన చేసిన పోస్ట్‌తో ఇక్కడ అవమానం జరిగింది ఆడవారికా? మగవారికా? అనే చర్చ జరుగుతున్నది.

### 'గాసిప్స్'ను బేస్‌గా చేసుకొని..

సినీ రంగంలో 'గాసిప్స్' కామన్. వీటిని కొన్ని వెబ్ సైట్లు, యూట్యూబ్ ఛానళ్లు, మరికొన్ని పత్రికలు ప్రచారం కల్పించి తమ వ్యూస్‌ను పెంచుకుంటాయి. అయితే బాధ్యత గల మంత్రి పదవిలో ఉన్న కొండా సురేఖ నిజానిజాలను నిర్ధారించుకోకుండా.. కేవలం రాజకీయ ప్రత్యర్థిని చిక్కుల్లో నెట్టేయాలనే ఆలోచనతో 'గాసిప్స్'ను బేస్‌గా చేసుకొని విమర్శలు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే అవి మరింత జుగుప్సాకరంగా ఉండడంతో సినీరంగమంతా ఒక్కటై స్పందించింది. తామంతా ఏకమై నిలబడతామని మా అధ్యక్షుడు మంచు విష్ణు సైతం ప్రకటించారు. కొండా సురేఖపై క్రిమినల్ చర్యల కోసం నాగార్జున కోర్టును సైతం ఆశ్రయించారు. సమంత, రకుల్ ప్రీత్ సింగ్ సైతం దీనిపై స్పందించి మంత్రి వ్యాఖ్యలను ఖండించారు.

### జవాబు చెప్పాల్సింది ప్రభుత్వమే..!

ఫోన్ ట్యాపింగ్ ద్వారా కేటీఆర్ సినీ హీరోయిన్ల సంభాషణలను రికార్డ్ చేసి వారిని బ్లాక్ మెయిల్ చేశారనేది కొండా సురేఖ మరో ఆరోపణ. అంతేకాకుండా హీరోయిన్లకు డ్రగ్స్ అలవాటు చేశారని, కేటీఆర్ ఒత్తిడి భరించలేకనే రకుల్ ప్రీత్ సింగ్‌తో పాటు మరికొందరు హీరోయిన్లు తొందరగా పెళ్లి చేసుకొని సినీ ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారని చెప్పుకొచ్చారు. కామన్‌గా ఇతర రంగాలతో పోల్చుకుంటే సినీరంగంలో పని చేసే మహిళలకు ధైర్యం ఎక్కువే అని చెప్పొచ్చు. ఎంతటి తీవ్రమైన ఆరోపణలు, విమర్శలు, గాసిప్స్ ద్వారా క్యారెక్టర్ అసోసియేషన్ చేసినా వాటన్నింటిని తట్టుకొని నిలబడతారు. సినీ రంగంలో కొనసాగుతారు. అయితే హీరోయిన్లను కేటీఆర్ బ్లాక్ మెయిల్ చేసి ఉంటే, వారిని డ్రగ్స్‌కు అలవాటు చేసి ఉంటే ఒక్కరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదు ఎందుకు? కనీసం మాట్లాడలేదు ఎందుకు? అప్పుడు ఆ పార్టీ అధికారంలో ఉందనే అనుకున్నా.. విపక్షంలో ఉన్న కాంగ్రెస్‌పై వారికి నమ్మకం లేకుండా పోయిందా? కనీసం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అండగా ఉంటుందని అనుకోలేదా? బీఆర్ఎస్ అధికారం కోల్పోయి పది నెలలకు పైగా గడుస్తున్నా.. ఇప్పటికీ ఎందుకు ఆ విషయం గురించి మాట్లాడడానికి ముందుకు రావడం లేదు? అసలు కేటీఆర్ బ్లాక్ మెయిల్ చేశారని, డ్రగ్స్ అలవాటు చేశారని కాంగ్రెస్ నేతలు భావిస్తుంటే.. పది నెలలుగా అధికారంలో ఉన్నవారు అలాంటి వాటిపై ఎందుకు ఎంక్వయిరీ చేయించడం లేదో సమాధానం చెప్పాల్సిన అవసరమున్నది. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అనేక విషయాల్లో విచారణలు జరుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం... సినీ హీరోయిన్లు ముఖ్యంగా ఆడవాళ్లకు అన్యాయం జరిగి ఉంటే ఎందుకు స్పందించడం లేదో చెప్పాల్సిన అవసరం కూడా ఉన్నది. అప్పటి డ్రగ్స్ ఎంక్వయిరీ బయటకొచ్చిన విషయాలనే చెబుతున్నానని ఒక మంత్రిగా ఉన్న కొండా సురేఖ బహిరంగంగానే మాట్లాడినా... ఆ ఎంక్వయిరీ రిపోర్టును ప్రజల ముందుకు ఎందుకు తేవడం లేదో కాంగ్రెస్ ప్రభుత్వమే చెప్పాలి.

### అసభ్యతకు అసభ్యతేనా జవాబు!

రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజం. ఆంధ్రాలోని నాయకులు వాడే భాషపై ఎన్నో విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా ప్రస్తుతం అలాంటి పరిస్థితే కనిపిస్తున్నది. అయితే మహిళల పట్ల ఒక నాయకుడు అసభ్యకరంగా మాట్లాడారనుకుంటే.. జవాబు సైతం అసభ్యకరంగా రావడం ఎలా ఆమోదయోగ్యమవుతుంది? అధికారంలో ఉన్నవారు అలాంటి వాటికి జవాబు చెప్పడానికి అనేక మార్గాలు ఉంటాయి. చర్యలు తీసుకునేందుకూ అవకాశముంటుంది. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు మాట్లాడే ముందు ఒకటికి నాలుగుసార్లు ఆలోచించి మాట్లాడాలి. నోరు జారితే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందో గత చరిత్రను పరిశీలించి జాగ్రత్తగా మసలుకోవాలి.

## బతుకమ్మ వేడుకలకు కవిత దూరమైనట్లేనా.. కార్యకర్తలు జరుగుతున్న తాజా చర్చ ఇదే..



**హైదరాబాద్, :** రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా.. ఎవరి అభిప్రాయాలు ఎలా ఉన్నా.. తెలంగాణలో జరిగే బతుకమ్మ పండుగకు కవిత బ్రాండ్ అంబాసిడర్ లాంటిది.. ఆడబిడ్డల సంబరాన్ని అంబరాన్ని తాకేలా కవిత చేసారనే దాంట్లో ఎటువంటి సందేహం లేదు.. కారణాలు ఏవైనా.. ఈసారి బతుకమ్మ పండుగకు ఆమె దూరంగా ఉండటం పొలిటికల్ గానే కాకుండా ట్రెడిషనల్ గా కూడా చర్చనీయాంశంగా మారింది.. పండుగలతో జనాన్ని జాగృతం చేసి ఉద్యమాలలో వారిని భాగం చేయొచ్చు అని కవిత నిరూపించారు.. ఉద్యమాలలో పూల పండుగను భాగం చేసిన కవిత ఈసారి జరిగే బతుకమ్మ వేడుకలలో పాల్గొనే పరిస్థితుల్లో లేరనేది పార్టీ వర్గాలు చెబుతున్న మాట.. ఈసారి ఆమె బతుకమ్మ వేడుకలలో పాల్గొనక పోవడం.. పార్టీ కార్యకర్తలు తీవ్ర ఆవేదాన్ని కలిగిస్తోందట.. తండ్రి కెసిఆర్ తెలంగాణ జెండాన్ని భుజానికి ఎత్తుకొని ఉద్యమాలు చేస్తుంటే.. జన జాగృతిని స్థాపించిన కవిత.. పూల పండుగను తన పోరాటానికి వేదికగా చేసుకుంది. నేటితరం మర్చిపోయిన బతుకమ్మకు.. ఆమె జీవం పోశారని.. ఊరురా తిరుగుతూ ఆడపిల్లలతో కలిసి బతుకమ్మ ఆడుతూ.. తెలంగాణకే సొంతమైన పండుగలో మరోసారి వెలుగులు నిండేలా చేసారని.. ఆమె అనుకూల వర్గం చెబుతున్న మాట.. గ్రామీణ ప్రాంతాలలో అంగరంగ వైభవంగా జరిగే బతుకమ్మ పండుగను దేశ విదేశాలకు చాటి చెప్పింది ఆమె.. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వం అధికారికంగా ట్యాంక్ బండ్ మీద ఉత్సవాలు నిర్వహించడం లో కవిత కీలక పాత్ర పోషించారు.. గడిచిన పదేళ్లలో ఒక్కొక్క ఏడాది ఒక్కొక్క జిల్లాలో బతుకమ్మ పండుగ చేసుకుంటూ రాష్ట్రమంతా పూల పండుగకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. పూల పండుగ నిర్వహణలో అన్ని తానే వ్యవహరించారు.. గత ఏడాది దుబాయ్ లోని బుర్జు కలీఫా పై బతుకమ్మ బొమ్మ పడేలా చేసి.. పూల పండుగ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు.. ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ తో బతుకమ్మకు ట్యూన్ కట్టించిన ఘనత కూడా ఆమెకి దక్కుతుంది.. బతుకమ్మకు బ్రాండ్ అంబాసిడర్ గా చెప్పుకుంటున్న కవితమ్మ ఈసారి బతుకమ్మ వేడుకలకి దూరంగా ఉన్నారనే ప్రచారం జరుగుతుంది.. ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆమె బతుకమ్మ వేడుకలకు దూరం అవుతున్నారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో అరెస్టై.. ఆరు నెలల పాటు బీహార్ జైల్లో గడిపారు ఆమె.. ఇటీవల జైలు నుంచి విడుదలైన కవితకు పలు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి.. ఈ క్రమంలో ఆమె ఇంటి నుంచి బయటికి రావడం లేదు.. ఈ క్రమంలో ఎంగిలి పూలతో బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి.. అయితే ఎక్కడా కూడా కవిత కనిపించకపోవడంతో పార్టీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఈసారి బతుకమ్మ వేడుకలకి కవితమ్మ రాదనే ప్రచారం జరుగుతోంది.. ఆరోగ్యం సహకరిస్తే సద్దుల బతుకమ్మకైనా కవితమ్మ వస్తారని ఆశగా చెబుతున్నారు జాగృతి కార్యకర్తలు..

## పవన్ కళ్యాణ్‌పై మధురైలో కేసు నమోదు



**అమరావతి,:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మధురైలో కేసు నమోదైంది. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌ను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు గాను మధురైలోని కమిషనరేట్ లో వాంజినాథన్ అనే లాయర్ కంప్లైంట్ ఇచ్చాడు. సనాతన ధర్మం పై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను పవన్ వక్రీకరించారని ఫిర్యాదులో తెలిపారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని కోరాడు. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై గతేడాది సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం చేసిన సంగతి తెలిసిందే. సనాతన నిర్మూలన సభలో ముఖ్య అతిథిగా హాజరైన స్టాలిన్ మాట్లాడుతూ.. మనం డెంగీను, దోమలను, మలేరియాను లేదా కరోనాను వ్యతిరేకించలేం. వాటిని నిర్మూలించాల్సిందే. అలాగే సనాతన ధర్మాన్ని కూడా నిర్మూలించాలంటూ ఉదయనిధి కీలక వ్యాఖ్యలు చెప్పారు. సనాతన అంటే సంస్కృతం నుంచి వచ్చిందని, ఇది సాంఘిక న్యాయం, సమానత్వాలకు, మహిళా సాధికారతకు వ్యతిరేకమని ఉదయనిధి స్టాలిన్ స్పష్టం చేశారు. అయితే ఈ మాటలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు పలుకగా, బీజేపీ నాయకులు అప్పుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇదే వ్యాఖ్యలపై తాజాగా పవన్ కళ్యాణ్ స్టాలిన్‌ను ఉద్దేశించి సంచలన కామెంట్స్ చేయడంతో పాటు పరోక్షంగా సీఎం స్టాలిన్‌కు వార్నింగ్ ఇచ్చారు. పవన్ మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని ఎవరూ తుడిచిపెట్టలేరని, సనాతన ధర్మాన్ని తుడిచిపెట్టాలనుకున్న వారే తుడిచిపెట్టకుపోతారని తిరుపతి బాలాజీ సాక్షిగా ఈ మాట చెబుతున్నా అంటూ పవన్ కళ్యా తిరుపతిలో జరిగిన వారాహి డిక్లరేషన్ సభలో హెచ్చరించారు. ఇతర మతాలపై ఆ తరహా వ్యాఖ్యలు ఆయన చేసి ఉంటే ఈపాటికి దేశం తగలబడి పోయి ఉండేదని పవన్ అన్నారు. పవన్ వారాహి డిక్లరేషన్ సభలో తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ పేరు ప్రస్తావించకుండా పరోక్షంగా మాట్లాడారు. కానీ, హిందువులు మాత్రం మౌనంగా ఉండాలా అని ప్రశ్నించారు. దీంతో పవన్ వ్యాఖ్యలపై అటు తమిళనాడు డీఎంకే నేతలకు.. ఇటు జనసేన నేతలకు సోషల్ మీడియాలో వార్ జరుగుతోంది. మరోవైపు సనాతన ధర్మం గురించి పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై మీ స్పందన ఏమిటి..? అని మీడియా ప్రతినిధులు ఉదయనిధి స్టాలిన్‌ను ప్రశ్నించగా.. ఆయన ఏక వాక్యంలో ముక్తసరిగా 'ఏం జరుగుతుందో చూద్దాం' అంటూ దాటవేశారు.

## పార్టీ ప్రక్షాళన దిశగా అడుగులేస్తున్న వైసీపీ అధినేత జగన్..

### క్యాడర్ లో జోష్ నింపేలా వ్యూహాలు



**అమరావతి,:** కీలక నేతలు రాజీనామాలు చేస్తున్న వేళ.. ఫ్యానుని స్పీడ్ గా తిప్పేందుకు వైసిపి అధినేత జగన్ కీలక మార్పులు చేస్తున్నారు.. భవిష్యత్ మనదే అంటూ కేడర్లో భరోసా నింపే ప్రయత్నం చేస్తున్నారు.. తప్పులను సమీక్షించుకొని పార్టీ ప్రక్షాళనకు నడుం బిగిస్తున్నారు.. అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తూనే కొందరు కీలక నేతలకు బాధ్యతలు అప్పగిస్తున్నారు.. పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న వారికి.. ప్రాధాన్యత ఇస్తున్నారు.. వరుస సమీక్షలు నిర్వహిస్తూ కేడర్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు.. సంక్షేమ పథకాలు మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయని భావించిన జగన్ లెక్క తప్పింది.. వై నాట్ 175 అన్న వైసీపీకి 11 సీట్లు దక్కాయి.. నిన్న మొన్నటి దాకా ఓటమి షాక్ లో ఉన్న పార్టీ నాయకత్వం.. ఇప్పుడు పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టింది.. ముఖ్య నేతలు కూడా పార్టీకి గుడ్ బై చెబుతూ ఉండడంతో స్వయంగా జగన్మోహన్ రెడ్డి రంగంలోకి దిగారు.. నష్ట నివారణ చర్యలు తీసుకుంటూనే.. పార్టీ ప్రక్షాళన పై ఆయన దృష్టి పెట్టారు.. క్యాడర్ లో కొత్త ఉత్తేజాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు.. ఎన్నికల ఫలితాలపై జిల్లాల వారీగా అంతర్గత సమీక్షలు నిర్వహిస్తూ.. నూతన నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా అడుగులు వేస్తున్నారు.. జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహిస్తూనే.. నియోజకవర్గాల వారీగా ఇన్చార్జిల నియామకాన్ని చేపడుతున్నారు.. పార్టీకి గుడ్ బై చెప్పి అధికార పార్టీలో చేరుతున్న వారికి ప్రత్యామ్నాయంగా నేతలను తయారు చేస్తున్నారు.. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి.. ఎంపీటీసీలు జడ్పిటిసి లతో పాటు ముఖ్య నేతలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్నారు.. ఇప్పటిదాకా జిల్లా నేతలతో సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్న జగన్.. పనిలో పనిగా అనుబంధ సంఘాలను సైతం యాక్టివ్ చేస్తున్నారు.. వారి ద్వారా పార్టీ కార్యక్రమాల్ని జనాల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీలో ఏర్పడిన నిస్తేజానికి చెక్ పెట్టేలా జగన్ వ్యూహాల రచిస్తున్నారు.. పార్టీలో ఉండే ప్రతి ఒక్కరికి పెద్దపీట వేస్తూనే.. పోరాటాలకు సిద్ధం కావాలనే సంకేతాలను పంపుతున్నారు.. ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకు అన్ని జిల్లాలకు సంబంధించిన ముఖ్య నేతల సూచనలు సలహాలను జగన్ తీసుకుంటున్నారట.. వారి సూచనలు సలహాలపై ఆయన ఓ నిర్ణయం తీసుకొని దాన్ని అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.. ఎన్నికల సమయంలో పార్టీలోకి వచ్చిన వారికి.. కీలక బాధ్యతలు అప్పగించాలని ఆయన భావిస్తున్నారట.. క్యాడర్ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని వారి అభిప్రాయాలకు అనుగుణంగా జిల్లాలకు అధ్యక్షులు నియమిస్తున్నారు. మొత్తంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు..

# స్వాతంత్ర్య శతాబ్దికి మన భాగ్య చక్రం

## 'పళని' పలుకు



నేను ఒక బ్రేకింగ్ న్యూస్ ఇవ్వదలిచాను అయితే ఇది చాలా భిన్నమైనది. చట్టాన్ని ఉల్లంఘించడానికి సంబంధించినది కాదది. తలలు పగుల గొట్టడం లేదా గృహాలను ధ్వంసం చేయడం గురించిన న్యూస్ కాదది. గతంలో అనేక పర్యాయాలు వీక్షకులను ఉత్కంఠభరితులను చేసిన బ్రేకింగ్ న్యూస్ కాదది. హింసాత్మక నేరాల పెరుగుదలను జాతీయ నేరాల నమోదు బ్యూరో నమోదు చేసినప్పుడు అది చట్టాల ఉల్లంఘనకు సంబంధించిన న్యూస్ అవుతుంది. నిఘా బృందాలు ఒక యువ జంటను చావబాదినప్పుడో లేదా ఒక వ్యక్తిని చిత్రవధతో చంపివేసినప్పుడో అది తలలు పగులగొట్టడం, ఎముకలను విరిచివేయడానికి సంబంధించిన న్యూస్ అవుతుంది. కబ్జా చేసిన ప్రదేశాలలో నిర్మించిన గృహాలను కూల్చివేసేందుకు అధికారులు బుల్డోజర్లను వినియోగించినప్పుడు అది ఇళ్ల కూల్చివేత న్యూస్ అవుతుంది. గౌరవనీయ ప్రధానమంత్రి ప్రతిపక్షాన్ని ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని తుక్డే తుక్డే గ్యాంగ్ అనో లేదా అర్బన్ నక్సల్స్ అనో నిందించినప్పుడు ఆ బ్రేకింగ్ న్యూస్ ఒక పెద్ద ఆవలింతకు కారణమవుతుంది. నేను మీతో పంచుకోదల్చిన అత్యంత ముఖ్యమైన బ్రేకింగ్ న్యూస్ మీ నమ్మకాలను వమ్ము చేస్తుంది, మీ ఆశలను కూల్చివేస్తుంది. మీ హృదయాలను పగులగొడుతుంది. కె.వి. కామత్ ఒక ప్రముఖ బ్యాంకర్. భారతదేశ అగ్రగామి ప్రైవేట్ బ్యాంక్‌గా ఐసిఐసిఐను అభివృద్ధిపరిచింది ఆయనే. న్యూ డెవలెప్‌మెంట్ బ్యాంక్ (బ్రిక్స్ దేశాల బ్యాంక్) ప్రథమ చైర్మన్ కూడా ఆయనే. కె.వి. కామత్ ఇప్పుడు నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్‌కు చైర్మన్‌గా ఉన్నారు. ఇటీవల ఒక ప్రముఖ దినపత్రికలో ఒక పుస్తకాన్ని సమీక్షించారు. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి మన దేశం 'వికసిత్ భారత్' హోదా పొందేందుకు అనుసరించాల్సిన బాట గురించి ఆయన పేర్కొన్నారు. ఇంతకూ కామత్ సమీక్షించిన పుస్తక రచయిత ఎవరో చెప్పలేదు కదూ? ప్రముఖ ఆర్థికవేత్త కృష్ణమూర్తి సుబ్రమణియన్. 2018 నుంచి 2021 దాకా భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారుగా ఉన్నారు. స్థూల దేశీయోత్పత్తి 12.5 శాతం సగటు వార్షిక పెరుగుదలతో ప్రతి ఆరు సంవత్సరాలకు రెట్టింపు అవుతుందని, తద్వారా 2023లో 3.28 ట్రిలియన్ డాలర్ల నుంచి 2047లో 55 ట్రిలియన్ డాలర్లకు అంటే 16 రెట్లు పెరుగుతుందన్న కృష్ణమూర్తి అభిప్రాయంతో కామత్ ఏకీభవించారు. నేనూ హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాను. అటువంటి సుస్థిరాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవాలని నేనూ వాదించాను. కామత్ సమీక్షలో చివరి పేరాలు అసంతృప్తి కలిగించాయి. ఆయన పేర్కొన్న అంశాలు సంతోషదాయకమైనవి కావు. స్వాతంత్ర్య శతాబ్ది నాటికి భారత్‌ను సమగ్ర అభివృద్ధి చెందిన దేశంగా రూపొందించేందుకు దోహదం చేసే నాలుగు సుస్థిర ప్రాతిపదికలను పేర్కొన్నారు. అవి: స్థూల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యంబీ సమ్మిళిత సామాజిక, ఆర్థిక పురోగతిబీ ప్రైవేట్ రంగంలో నైతిక పద్ధతులతో సంపద సృష్టిబీ ప్రైవేట్ పెట్టుబడులకు ప్రాధాన్యం. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఈ అంశాల స్థితిగతులు ఎలా ఉన్నాయో చూద్దాం. ద్రవ్యలోటు, ద్రవ్యోల్బణం, వడ్డీరేటు, కరెంట్ ఖాతా లోటు, రుణాల/ జీడీపీ నిష్పత్తి మొదలైనవి స్థూల ఆర్థికాభివృద్ధి గురించిన స్థూల చిత్రాన్ని అందిస్తాయి. ద్రవ్యలోటు జీడీపీలో 3 శాతంగా ఉండాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అది ఇప్పుడు 5.6 శాతంగా ఉన్నది. ద్రవ్యలోటును 3 శాతానికి పరిమితం చేసేందుకు మనం ఇంకా చాలా దూరం పయనించవలసి ఉన్నది. ద్రవ్యోల్బణం ఇప్పటికీ 4 శాతానికి పైగా ఉన్నది. రిజర్వ్ బ్యాంక్ రెపో రేటు మే 2022 నుంచి 6.5 శాతంగా ఉన్నది. కరెంట్ ఖాతా లోటు 2023–24 ఆర్థిక సంవత్సరాంతానికి 23.2 బిలియన్ డాలర్లుగా ఉన్నది. అయితే ప్రవాస భారతీయులు పంపిస్తున్న నిధులు మనలను ఆదుకుంటున్నాయి. రుణాలు/ జీడీపీ నిష్పత్తి రేటు 18.7 శాతంగా ఉన్నది. ఇది భరించదగినదే. సమ్మిళిత సామాజిక ఆర్థిక పురోగతి ఎలా సాధ్యమవుతుంది? అసమానతలను తగ్గించేందుకు మోదీ ప్రభుత్వం విఫల ప్రయత్నం మాత్రమే చేసింది. దీనివల్ల భారీ నష్టం సంభవించింది. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, పెట్టుబడి సాంద్ర పరిశ్రమల్లో ప్రభుత్వ మదుపులు, కార్పొరేట్ పన్నుల తగ్గింపు, వినియోగ వస్తువులపై పన్నులు, ఇంధన ధరల పెరుగుదల, చాలీచాలని కనీస వేతనాలు, కౌలు రైతులను నిర్లక్ష్యం చేయడం, తదితర విధానాలు ఎగువన ఉన్న ఒక శాతం మందికి, దిగువన ఉన్న 20 శాతం మందికి మధ్య ఆర్థిక అసమానతలను విపరీతంగా పెంచాయి. విద్వేష ప్రచారాలు, మతోన్మాద ఘర్షణలు సమ్మిళిత సామాజిక అభివృద్ధికి అవరోధమవుతున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థలచే నైతిక పద్ధతుల్లో సంపద సృష్టి విషయాన్ని చూద్దాం. బ్యాంకుల్లో మోసాలు, కార్పొరేట్ కంపెనీల పతనాలు గత పదేళ్లలో గణనీయంగా పెరిగాయి. అనుచిత నిబంధనలు, నియంత్రణల ఎరుగుదల, పన్నుల పాలనా వ్యవస్థ మరింత కఠినంగా ఉండడం మొదలైనవి నైతిక విలువలను పాటించే వ్యాపారవేత్తలను తీవ్రంగా నిరుత్సాహపరుస్తున్నాయి. వారి వ్యాపార నిర్వహణలో క్రమశిక్షణకు భంగం కలిగిస్తున్నాయి. ఎంతో మంది యువ వ్యాపారవేత్తలు విదేశాలకు వలస వెళ్లేందుకు ఆరాటపడుతున్నారు. 4300 మంది భారతీయ మిలియనీర్లు భారత్ నుంచి నిష్క్రమించారు. కాంపిటీషన్ కమిషన్ వాస్తవానికి గుత్తాధిపత్యాలను మాత్రమే ప్రోత్సహిస్తోంది. పౌర విమానయానం, నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, టెలికమ్యూనికేషన్స్, చమురు శుద్ధి, సౌరశక్తి మొదలైన పరిశ్రమలలో పోటీ చాల స్వల్పస్థాయిలో మాత్రమే ఉంది. గుత్తాధిపత్యాలు పెరగడమే అందుకు కారణం. సిమెంట్, ఉక్కు, విద్యుత్, రిటైల్ మొదలైన పారిశ్రామిక, వ్యాపార రంగాలలో పోటీ పెరుగుతుందా లేక తగ్గిపోతుందా అనేది ఒక చర్చించదగిన అంశం. ఈ ధోరణులు పోటీ విపణి ఆర్థిక వ్యవస్థ పురోగతికి దోహదం చేసేవి కావు. కాల పరీక్షకు తట్టుకుని నిలిచిన పోటీ విపణి ఆర్థిక వ్యవస్థలో మాత్రమే ప్రైవేట్ రంగ సంస్థలు నైతిక పద్ధతులలో సంపదను సృష్టించగలుగుతాయి. ప్రైవేట్ పెట్టుబడుల విషయాన్ని చూద్దాం. అవును, ప్రైవేట్ పెట్టుబడులతో మాత్రమే భాగ్యచక్రం తిరుగుతుంది. దురదృష్టవశాత్తు ప్రభుత్వ మదుపుల కంటే ప్రైవేట్ మదుపులు బాగా వెనకబడి ఉన్నాయి. ప్రభుత్వం ఎంతగా ప్రోత్సహిస్తున్నా, రాయితీలు ప్రకటిస్తున్నా నయాన భయాన చెబుతున్నా ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం లేదు వ్యాపారవేత్తలను ప్రభుత్వం విశ్వసించడం లేదు. ప్రభుత్వ సమర్థత, ఉదారతలో వ్యాపారవేత్తలకు నమ్మకం కుదరడం లేదు. పలు వ్యాపార సంస్థలను సంశయాస్పద పద్ధతులలో స్వాధీనం చేసుకుంటున్న తీరుతెన్నులు కూడా వ్యాపార వాతావరణాన్ని సానుకూలంగా ఉంచడం లేదు. 2000 సంవత్సరం నుంచి ఇంతవరకు 8000 భారతీయ కంపెనీలు సింగపూర్‌లో నమోదు అయ్యాయి. దర్యాప్తు సంస్థలు ప్రతి విషయాన్నీ తరచి తరచి చూస్తున్న తీరు వ్యాపారవేత్తలలో భయాందోళనలకు బాగా ఆస్కారమిస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో మదుపు చేయకుండా భారతీయ వ్యాపార సంస్థలను నిలువరిస్తున్నదేమిటి? సెప్టెంబర్ 2022లో గౌరవనీయ ఆర్థిక మంత్రి అడిగిన ప్రశ్న అది. ప్రస్తావిత అంశాలు అన్నిటిపైనా సాధికారంగా మాట్లాడేందుకు ఉత్కృష్ట అర్హతలు ఉన్న వ్యక్తి కామత్ మాత్రమే.


# డిక్లరేషన్‌పై అనవసర రాద్ధాంతం!





హిందువుల మనోభావాలతో ఆడుకుంటూ డిక్లరేషన్‌పై మాజీ సీఎం జగన్‌రెడ్డి అనవసర రాద్ధాంతం చేసారు. ఆలయాలకు సంప్రదాయాలు, నిబంధనలు ఉంటాయి. అన్యమతస్తులు ఎవరైనా ఆలయంలోకి వెళ్లాలంటే ఆ నియమాలు పాటించి తీరాల్సిందే. ఈ నియమాలు కేవలం ఆంధ్రప్రదేశ్‌లోని ఆలయాలకు, హిందుమతానికే పరిమితం కాదు. దేశంలో అన్ని ఆలయాలలో నియమాలు పాటించాలి. పూరి జగన్నాథ్ ఆలయం, కేరళ గురువాయూర్ ఆలయం, వారణాసి కాశీ విశ్వనాథుని ఆలయం, భువనేశ్వర్‌లోని లింగరాజ్ ఆలయం, కేరళ అనంత పద్మనాభస్వామి ఆలయం, తమిళనాడు కామాక్షి అమ్మ ఆలయం, రాజస్థాన్ దిల్వారా ఆలయం... ఇలా ఎన్నో చోట్ల ఆలయాల్లోకి హిందువులకి మాత్రమే అనుమతి ఉంది. ఆఖరికి పొరుగు దేశం నేపాల్‌లోని పశుపతినాథ్ ఆలయంలోకి హిందువులకి మాత్రమే అనుమతి ఉంది. వేరే మతస్థులు హిందూ ఆలయాల్లోకి వెళ్లి, తెలిసో తెలియకో తమ మత పద్ధతుల ప్రకారం ప్రార్థన చేస్తే లోపల గొడవలు అయ్యే అవకాశముంటుంది. అందువల్ల ఆ గుడి ప్రార్థనా పద్ధతులు, నియమాల సమాచారం తెలుసుకుని, వాటికి అనుగుణంగా ఉంటానని డిక్లరేషన్ ఇవ్వాలి. శ్రీవారిని దర్శించుకునేందుకు ముందుగా డిక్లరేషన్ ఫారంపై సంతకం చేసే సంప్రదాయం బ్రిటిష్ కాలం నుంచే అమల్లో ఉంది. ఇతర మతాలకు చెందిన వ్యక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తే కచ్చితంగా డిక్లరేషన్ ఇవ్వాలని 1990 ఏప్రిల్ 11న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ శాఖ చట్టం 30/1987ని అనుసరించి జీఓను విడుదల చేసింది. చేతిలో అధికారం ఉందని అన్యమతస్తుడైన జగన్‌రెడ్డి ఆలయంలోకి డిక్లరేషన్ లేకుండానే ప్రవేశించారు. గతంలో పని చేసిన టీటీడీ చైర్మన్ జగన్ సేవలో తరించారు కాబట్టి డిక్లరేషన్‌ను పక్కనబెట్టారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకొంటానని, తర్వాత రద్దు చేసుకోవడం ద్వారా జగన్ తన వికృత నైజాన్ని మరోసారి చాటుకొన్నారు. హిందూ ఆచారాలకు, సంప్రదాయాలకు తాను వ్యతిరేకినని బయటపెట్టుకొన్నాడు. దళితులు కూడా హిందువులేనని, వారికి తిరుమల శ్రీవారిని దర్శించుకొనే హక్కు వుందని జగన్‌రెడ్డి తెలుసుకోవాలి. డిక్లరేషన్‌పై సంతకం చెయ్యడం ఇష్టం లేకనే కులాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. సీఎంగా పనిచేసిన జగన్‌రెడ్డికి టీటీడీ విధించిన నిబంధనలు మతానికో, కులానికో కాదని తెలియదా? తిరుమల శ్రీవారి ఆలయంలో డిక్లరేషన్ మీద సంతకం చేయాల్సి వస్తుందని, ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే జగన్‌రెడ్డి తిరుమల దర్శనాన్ని రద్దుచేసుకొని, పైగా తనను అడ్డుకొన్నారని సాకులు చెప్పారు. దేశవ్యాప్తంగా ఇతర మతస్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నప్పుడు డిక్లరేషన్ ఇస్తారు. అంతమాత్రాన వారు తమ సొంత మతాన్ని వదులుకున్నట్లు కాదు, తమ ఆచారాలను వదిలేసినట్లూ కాదు. గతంలో అనేక మంది ప్రముఖులు ఎలాంటి భేషజాలకు పోకుండా డిక్లరేషన్‌పై సంతకం చేశాకే దర్శనానికి వెళ్లారు. వెంకటేశ్వరస్వామి దర్శనానికి తాను వెళ్లకుండా ఆంక్షల పేరిట అడ్డుకుందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేసి, పర్యటనను రద్దు చేసుకొన్న జగన్‌రెడ్డి బెంగళూరు వెళ్లిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో పూజలు చేయాలంటూ వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఆయన కార్యక్రమం అమలు తీరునూ సమీక్షించ లేదు. సాకులు చెబుతూ దైవదర్శనాన్ని రద్దు చేసుకుని అనవసర రాద్ధాంతం చెయ్యడమేమిటని ప్రజలు విస్తుపోతున్నారు.

# ఇజ్రాయెల్‌కు మూడింది



టెహ్రాన్: బద్ధ శత్రువైన ఇజ్రాయెల్‌కు ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ (85) స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఆ దేశంపై ఇటీవల తాము చేసిన క్షిపణి దాడుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. యూదు పాలకుల నేరాలకు ఇది కనిష్ఠ శిక్ష అని పేర్కొన్నారు. తమ సైనిక దళాలు అద్భుతమైన కార్యం నిర్వర్తించాయని కొనియాడారు. అవసరమైతే హెజ్‌బొల్లా, హమాస్ తదితర గ్రూపులతో కలిసి ఇజ్రాయెల్‌పై మరోసారి దాడులు చేస్తామని తేల్చిచెప్పారు. "ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనా, లెబనాన్‌లో జరుగుతున్న పోరాటాలకు మద్దతిస్తున్నాం. శత్రువును ఓడించి తీరతాం" అని ప్రకటించారు. "అఫ్గానిస్తాన్ నుంచి యెమన్ దాకా, ఇరాన్ నుంచి గాజా, లెబనాన్ దాకా ముస్లిం దేశాలన్నీ ఈ ప్రయత్నంలో ఒక్కటి కావాలి. ఉమ్మడి శత్రువైన ఇజ్రాయెల్‌కు మర్చిపోలేని గుణపాఠం నేర్పాలి" అంటూ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్ ఎక్కువ కాలం ఉనికిలో ఉండబోదని జోస్యం చెప్పారు. ఇజ్రాయెల్‌పై ఇరాన్ ఇటీవలి క్షిపణి దాడుల తర్వాత తొలిసారిగా ఆయన ప్రజలకు దర్శనమిచ్చారు. శుక్రవారం టెహ్రాన్‌లోని మొసల్లా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ జన సందోహాన్నిఉద్దేశించి చరిత్రాత్మక ప్రసంగం చేశారు. రైఫిల్ చేబూని ఆద్యంతం భావోద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఖమేనీ బహిరంగంగా మాట్లాడడం నాలుగేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం గమనార్హం. హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను బంకర్ బాంబులతో ఇజ్రాయెల్ హతమార్చిన వెంటనే ఆయనను హుటాహుటిన సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు వార్తలు రావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇలా జనం మధ్యలోకి రావడమే గాక చరిత్రాత్మక మసీదును వేదికగా చేసుకుని ప్రసంగించడానికి చాలా ప్రాధాన్యత ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు గట్టి హెచ్చరిక సంకేతాలు పంపడంతో పాటు ఆ దేశంపై పోరులో ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గేది లేదని పశ్చిమాసియాలోని హమాస్, హెజ్‌బొల్లా, హౌతీల వంటి సాయుధ గ్రూపులకు భరోసా ఇవ్వడం ఖమేనీ ఉద్దేశమని విశ్లేస్తున్నారు. పశ్చిమాసియాలో భీకర యుద్ధం తప్పదని కూడా ఖమేనీ ప్రసంగం సంకేతాలిచ్చిందంటున్నారు. ప్రధానంగా ఫార్సీలోనూ, పాలస్తీనా, లెబనాన్ మద్దతుదారు కోసం మధ్యలో అరబిక్‌లోనూ ఆయన 40 నిమిషాలపాటు మాట్లాడారు. "గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ నేతృత్వంలో పాలస్తీనా ప్రజలు చేసిన దాడిలో న్యాయముంది. పాలస్తీనా పౌరుల చర్య చట్టబద్ధమే. ఇజ్రాయెల్‌పై మా దాడులు కూడా చట్టబద్ధమే"అని ఉద్ఘాటించారు.

**నస్రల్లా మార్గం స్ఫూర్తిదాయకం**

ఖమేనీ ప్రసంగానికి ముందు టెహ్రాన్‌లో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తోపాటు ఇరాన్ ఉన్నతాధికారులు, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ జనరల్స్ హాజరయ్యారు.

**చేతిలో రైఫిల్ వెనక...**

ఖమేనీ తన ప్రసంగం సందర్భంగా రైఫిల్ చేతబట్టడం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. అది రష్యాలో తయారైన డ్రాగనోవ్ రైఫిల్. ఇజ్రాయెల్ విషయంలో వెనుకడుగు వేసే సమస్యే లేదని, తీవ్ర ప్రతిఘటన తప్పదని తన చర్య ద్వారా ఆయన స్పష్టమైన సంకేతాలిచ్చినట్టు భావిస్తున్నారు. శత్రువుపై పోరాడాలని, విశ్వాసాన్ని బలోపేతం చేసుకోవాలని ప్రజలకు ఖమేనీ పిలుపునివ్వడం కూడా ఇందుకు బలం చేకూరుస్తోంది. ఇజ్రాయెల్ చేతిలో ఇరాన్ వరుసగా ఎదురుదెబ్బలు తింటున్న నేపథ్యంలో డీలా పడ్డట్టు కన్పిస్తున్న సైన్యంతో పాటు దేశ ప్రజల్లో నైతిక స్థైర్యం పెంచేందుకు ఆయన ప్రయత్నించారంటున్నారు.

**ఆ మసీదే ఎందుకు?**

ఖమేనీ దేశ ప్రజలకు సందేశం ఇచ్చేందుకు రాజధాని టెహ్రాన్‌లోని చరిత్రాత్మక ఇమామ్ ఖొమేనీ మసీదును ఎంచుకున్నారు. 18వ శతాబ్దంలో నిర్మించిన ఈ మసీదుకు ఇరాన్‌లో విశేషమైన ప్రాముఖ్యముంది. దీన్ని గతంలో షా మసీదుగా పిలిచేవారు. 1979 నాటి ఇస్లామిక్ విప్లవంలో ఈ మసీదు కీలక పాత్ర పోషించింది. నగరంలో ఇదో ల్యాండ్‌మార్క్. ప్రజా పోరాటాలకు, నిరసన గళానికి చిహ్నం. అప్పట్లో ఈ మసీదు కేంద్రంగానే ప్రజలు ఉద్యమించారు. ఇరాన్ పాలకుడు షా మొహమ్మద్ రెజా పహ్లావీని గద్దె దించారు. అనంతరం అయతొల్లా రుహొల్లా ఖొమేనీ నాయకత్వంలో ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌గా ఆవిర్భవించింది. ఇస్లామిక్ జాతీయవాద నినాదం కింద పలు రాజకీయ పక్షాలు ఏకమవడానికి ఈ మసీదు వేదికగా ఉపయోగపడింది.

## బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోంది



హైదరాబాద్ : బీజేపీ ప్రభుత్వం ప్రజలను భయపెట్టడంతో పాటు రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. మహారాష్ట్ర లోని కొల్హాపూర్లో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. సింధుదుర్గ్ జిల్లాలోని రాజ్కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనను ఉద్దేశిస్తూ.. బీజేపీ సర్కార్పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రజలను భయపెడుతూ, రాజ్యాంగాన్ని, ఆయా సంస్థలను నాశనం చేస్తూ.. ఇప్పుడు ఛత్రపతి శివాజీ ఎదుట తలవంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. శివాజీ అందించిన సందేశం దేశమంతటికీ వర్తిస్తుంది. ఛత్రపతి, షాహూ మహరాజ్ లాంటి యోధులు లేకపోయి ఉంటే.. నేడు మనకు రాజ్యాంగం ఉండేది కాదు" అని ప్రధాని మోడీ ని ఉద్దేశిస్తూ రాహుల్ వ్యాఖ్యానించారు.

శివాజీ విగ్రహం కూలిన ఘటన.. నా తలవంచి క్షమాపణలు చెప్తున్నా: మోడీ

కాగా.. భారీ వర్షాల కారణంగా ఈ ఏడాది ఆగస్టులో రాజ్కోట్ కోటలో 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. నాణ్యతా లోపం కారణంగా విగ్రహం కూలిపోయిందంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు విమర్శలు చేశాయి. ఈ ఘటన చోటుచేసుకున్న తర్వాత రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోడీ.. శివాజీకి తల వంచి క్షమాపణలు తెలియజేశారు. మనకు ఈ దైవం కంటే గొప్పది ఏమీ లేదన్నారు. తాజాగా కొల్హాపూర్లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన రాహుల్.. నాడు ప్రధాని ప్రసంగాన్ని ఉద్దేశిస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు.

## "ఇమ్రాన్ ఖాన్ మద్దతు నిరసనల్లో పాల్గొనండి"..

### జైశంకర్‌కి పాకిస్తాన్ నేత ఆహ్వానం..





**న్యూఢిల్లీ,:** అక్టోబర్ 15-16 తేదీల్లో పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ గవర్నమెంట్ సమావేశానికి భారతదేశం తరుపున విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతున్నారు. ఇదిలా ఉంటే, గతేడాది నుంచి జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కి మద్దతుగా, పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్(పీటీఐ) పార్టీ నేతలు, కార్యకర్తలు ఇస్లామాబాద్‌లోని డీ-చౌక్‌లో నిరసనలకు ప్లాన్ చేశారు. ఈ నేపథ్యంలో పీటీఐ పార్టీ నేత నుంచి జైశంకర్‌కి వింత ఆహ్వానం ఒకటి వచ్చింది. ఇమ్రాన్ ఖాన్‌కి మద్దతుగా చేపట్టిన నిరసనల్లో జైశంకర్ పాల్గొనాలని పీటీఐ నాయకుడు ఒకరు ఆహ్వానం పంపారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ముఖ్యమంత్రి సలహాదారు ముహమ్మద్ అలీ సైఫ్ శుక్రవారం జియో న్యూస్ కార్యక్రమంలో మాట్లాడుతూ, పాకిస్తాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ నిరసనలో పాల్గొనవలసిందిగా జైశంకర్‌ని కోరారు. మా నిరసనల్లో పాల్గొనడానికి, మా ప్రజలతో మాట్లాడటానికి, పాకిస్తాన్‌లో ప్రతీ ఒక్కరూ కూడా నిరసన తెలిపే హక్కు ఉన్న బలమైన ప్రజాస్వామ్యాన్ని చూడటానికి భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌ని ఆహ్వానించాము అని సైఫ్ అన్నారు. తమ పార్టీ నిరసనని చూసి విదేశీ ప్రజలు సంతోషిస్తారని చెప్పారు. ప్రభుత్వం రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలని, న్యాయవ్యవస్థ స్వతంత్రత కోసం ఒత్తిడి తేవాలని పీటీఐ నిరసన తెలుపుతోంది. ఏడాదికి పైగా జైలులో ఉన్న తమ నాయకుడు ఇమ్రాన్ ఖాన్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే శనివారం డి-చౌక్ వద్ద నిరసన తెలిపేందుకు పిలుపునివ్వడంతో, పాక్ భద్రతాబలగాలు, పాక్ ఆర్మీ ఇస్లామాబాద్‌లో మోహరించాయి. రాబోయే ఎస్‌సీఓ సమ్మిట్ కోసం సైన్యం అక్టోబర్ 5-17 వరకు నగరంలో పాగా వేసింది. వేరే ప్రాంతాల నుంచి నగరానికి రాకుండా ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలను మూసేసింది. మొబైల్ సేవలపై ఆంక్షలు విధించారు.

## హైడ్రా చట్టబద్ధత ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం




హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రేవంత్ రెడ్డి సర్కారు మున్సిపల్ చట్టంలో మార్పులు చేసింది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. హైడ్రాకు చట్టబద్ధతను కేబినెట్ ఆమోదించిన నేపథ్యంలో ఆర్డినెన్స్ పై సంతకం కోసం రాజ్‌భవన్‌కు పంపింది. హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ కి విస్తృతాధికారాలు కల్పిస్తూ రాష్ట్ర సర్కార్? తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు శనివారం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు శనివారం రాజ్‌భవన్ గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్? చేసింది. అంతకుముందు హైడ్రా ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేయగా.. పురపాలక ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నివత్తి చేయడంతో తాజాగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఈ చట్టాన్ని రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు హైడ్రాకు ఈ ఆర్డినెన్స్ రక్షణగా నిలవనుంది. జీహెచ్ఎంసీ చట్టంలో సవరణకు గవర్నర్ ఆమోదం తెలపగా, జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374(బి) సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారు. కాగా, చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా ఇటీవల కూల్చివేసిన విషయం తెలిసిందే. దీంతో ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు హైడ్రా చట్టబద్ధతపై హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తాజాగా, గవర్నర్ ఆమోదం లభించడంతో అసెంబ్లీలో ఆమోదం తెలిపి హైడ్రాకు చట్టబద్ధతను పూర్తిస్థాయిలో తీసుకురానున్నారు. కాగా, హైదరాబాద్ నగర పరిధిలో నీటి వనరులు, ప్రభుత్వ ఆస్తులు, స్థలాలను కాపాడే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం హైడ్రాను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. జులై 19న హైడ్రాను జీవో ఎంఎస్ 99 ద్వారా ఏర్పాటు చేశారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని హైడ్రా పరిధిలో చేర్చారు. ఆ తర్వాత హైడ్రాకు క్రమంగా అధికారాలను పెంచుకుంటూ వచ్చింది ప్రభుత్వం. హైడ్రాకు ప్రత్యేక అధికారాలతోపాటు సిబ్బందిని కూడా పెద్ద ఎత్తున నియమించింది. తాజాగా, గవర్నర్ ఆమోదంతో హైడ్రా.. అక్రమ నిర్మాణాలపై మరింత దూకుడును ప్రదర్శించే అవకాశం ఉంది.

## రైతన్నకు భూమీ విషయంలో భయం లేకుండా చేస్తాం..



రాబోయే రోజుల్లో ఏ ఒక్క రైతన్నకు భూమీ విషయంలో భయం లేకుండ చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా తిరులమగిరి -సాగర్ మండలం, నెల్లికల్ లో.. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన ఫైలెట్ ప్రాజెక్టును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. మార్పు కోసం, ఇందిరమ్మ రాజ్యం కోసం పనిచేసి అధికారంలోకి వచ్చామన్నారు. యాచారం, తిరుమలగిరి మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. వాటి పరిష్కారంతో.. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఏ ఒక్క రైతన్నకు భూమీ విషయంలో భయం లేకుండా చేస్తామన్నారు. ధరణి పోర్టల్ తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటలు ఆడిందన్నారు. ఇప్పుడు 2020 చట్టాన్ని సవరణ చేస్తూ.. ప్రజలకు అనువైన ఆర్.ఓ.ఆర్ చట్టం అమలు చేస్తామన్నారు. ఈ చట్టాల విషయంలో ప్రతిపక్ష పార్టీల సలహాలు, సూచనలు స్వీకరిస్థామన్నారు. అటవీ, రెవిన్యూ శాఖల మధ్య వివాదం ఉన్న భూమి సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. గత ప్రభుత్వం తప్పిదలతో.. భూమి లేకున్నా పాస్ పుస్తకాలు సృష్టించి రైతుబంధు పొందారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిజమైన రైతులకు లబ్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. డిసెంబర్ నాటికి అర్హులైన పేదలకు ప్రభుత్వ భూముల పంచుతామన్నారు. అధికారం కోల్పోయిన ప్రస్టేషన్ లో.. మాపై ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

# జైళ్లా... కులతత్వ కూపాలా!



కులతత్వం బందీఖానాలో మగ్గుతున్న మన జైళ్లకు ఎట్టకేలకు 'విముక్తి' లభించినట్టే! రాజ్యాంగం అమల్లోకొచ్చి 74 యేళ్లవుతున్నా మనుస్మృతిని మించి ఆలోచించని మన కారాగారాల దివాంధ త్వాన్ని ఎండగడుతూ గురువారం సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలిచ్చింది. ఖైదీల పుట్టుక ఆధారంగా వారిపై వివక్ష ప్రదర్శించటం, పనులు అప్పజెప్పటం రాజ్యాంగ విరుద్ధమనీ, ఈ దురాచా రాన్ని మూడు నెలల్లో కట్టిపెట్టి ఆ సంగతి తెలియజేస్తూ నివేదికలు దాఖలు చేయాలనీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం రాష్ట్రాలనూ, కేంద్ర పాలిత ప్రాంతాలనూ ఆదేశించటం హర్షించదగ్గ పరిణామం. జైళ్లు సంస్కరణాలయాలంటారు. నేరాలకు పాల్పడుతూ సమాజానికి తలనొప్పిగా మారిన వ్యక్తులను సంస్కరించటం ధ్యేయంగా కారాగారాలు ఏర్పడ్డాయి. కానీ అక్కడా బయటి సమాజంలాగే కులం కుళ్లు నిండివుందనీ, దాని ఆధారంగా భయంకరమైన వివక్ష కొనసాగుతున్నదనీ... రాజ్యాంగ అధికరణలను ఉల్లంఘిస్తూ జైళ్లలో అంట రానితనం, వెట్టిచాకిరీ రాజ్యమేలుతున్నాయనీ ఆంగ్ల వెబ్‌సైట్ 'ది వైర్'లో పనిచేస్తున్న పాత్రికేయు రాలు సుకన్యా శాంత నాలుగేళ్ల క్రితం పరిశోధనాత్మక కథనం రాశారు. దాని ఆధారంగా నిరుడు సుప్రీంకోర్టులో ఆమె ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. ఆ పిటిషన్ పర్యవసానంగానే తాజా తీర్పు వెలువడింది. వలస పాలకుల హయాంలో ఎప్పుడో 1894లో రూపొందిన కారా గారాల చట్టం ఆధారంగా తయారైన మాన్యువల్‌లోని అంశాలే అన్ని జైళ్లలో అమలవుతున్నాయి. వాటిని పాలకులెవరూ పట్టించుకోలేదని కాదు. 2016లో కేంద్రం నమూనా మాన్యువల్‌ను తీసు కొచ్చింది. నిరుడు నమూనా జైళ్ల చట్టం కూడా రూపొందింది. కానీ జైళ్లు, మాన్యువల్స్ ఏమాత్రం మారలేదు. కానీ అడిగేదెవరు? నిర్బంధానికీ పుట్టకకూ, నిర్బంధానికీ నిరక్షరాస్యతకూ, నిర్బంధానికీ నిస్సహాయతకూ మధ్య అవినాభావ సంబంధం ఉన్నదని మన దేశంలో పదే పదే రుజువవుతోంది. జైలు శిక్షలు అనుభవిస్తు న్నవారు మాత్రమే కాదు, విచారణలో ఉన్న ఖైదీల్లో సైతం అత్యధికులు నిరుపేదలూ, నిరక్ష రాస్యులూ, అట్టడుగు కులాలవారూ, ఆదివాసీలూ ఉండటం యాదృచ్ఛికం కాదు. ఈ వర్గాలవారు దాదాపు 65 శాతం వరకూ ఉంటారు. ప్రపంచ దేశాల్లో ఈ వర్గాల సగటు 32 శాతానికి మించదని అనేక నివేదికలు చెబుతున్నాయి. యూపీఏ ఏలుబడిలో చేయని నేరానికి అరెస్టయి తొమ్మిదేళ్లపాటు ఢిల్లీ, మహారాష్ట్ర జైళ్లలో మగ్గిన పౌరహక్కుల నాయకుడు ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సుప్రీంకోర్టు తీర్పు అనంతరం ఇటీవల నిర్దోషిగా విడుదలయ్యాక మీడియా సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించింది జైళ్లలోని కుల వివక్ష గురించే. జైళ్లలో కుల వ్యవస్థ అమలవుతోందనీ, ఖైదీలకు కులాన్నిబట్టి పనులు ఇవ్వాలని మాన్యువల్‌లో సైతం ఉన్నదనీ ఆయన చెప్పినప్పుడు అందరూ నివ్వెరపోయారు. స్వాతంత్ర్యం వచ్చి 77 యేళ్లవుతున్నా ఈ దురాచారాలు అమలవుతున్నాయంటే బయటి సమాజంలో ఉండేవారు నమ్మలేరు. ఇవే దురాచారాలు సాధారణ పౌరులు పాటిస్తే వాటి పర్యవ సానాలు తీవ్రంగా ఉంటాయి. కఠిన శిక్షలు పడతాయి. కానీ ఎంతో నాగరికంగా కనబడే రాజ్యమే కారాగారాల్లో ఈ దారుణాలు అమలు చేయడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఉదాహరణకు దారి దోపిడీలు, ఇతరేతర నేరాలు చేస్తున్నవారు ఫలానా జాతులవారు గనుక వారిపై 'నేరస్త జాతులు' అనే ముద్రవేశారు వలసపాలకులు. రాజ్యాంగం అమల్లోకొచ్చాక అలాంటి దురాచారం రద్దయింది. కానీ ఇప్పటికీ జైళ్లలో సంచార, నేరస్త జాతులకు చెందినవారిగా కొందరిని వర్గీకరించి వారిని విడిగా ఉంచుతున్నారనీ, వారితో అమానవీయమైన పనులు చేయిస్తున్నారనీ సుప్రీంకోర్టు నిర్ధారించింది. అలాగే జైలు రిజిస్టర్‌లో కులం గురించిన కాలమ్ ఉండటం, ఖైదీలను కులాలవారీగా విభజించటం, అట్టడుగు కులాలవారితో మరుగుదొడ్లు శుభ్రం చేయించటం, ఇతర పారిశుద్ధ్య పనులు అప్పగించటం యధేచ్ఛగా కొనసాగుతున్నదని ధర్మాసనం గుర్తించింది. పుట్టుక ఆధారంగా వివక్ష ప్రదర్శించరాదని రాజ్యాంగంలోని 15(1) అధికరణ చెబుతోంది. 17వ అధికరణ అంటరానితనం నేరమంటున్నది. వెట్టి చాకిరీ చేయించరాదని 23వ అధికరణ అంటున్నది. ఇంకా 14వ అధికరణ పౌరులందరినీ సమానంగా చూడాలని, 21వ అధికరణ జీవించే, స్వేచ్ఛగా మసలే హక్కు కల్పించాలని నిర్దేశిస్తోంది. ఇవన్నీ ప్రాథమిక హక్కులు. ఈ హక్కులను రాజ్యమే ఉల్లంఘించటం ఎంత అపచారం! మహారాష్ట్ర మాన్యువల్ 'నేరస్త మహిళలు, వ్యభిచార మహిళలు, తార్పుడుగత్తెలు, యువ మహిళా ఖైదీలు' అంటూ విభజించిందట.'సాధారణ జైలుశిక్ష పడిన ఖైదీలు కిందికులాల వారైతే తప్ప తక్కువ స్థాయి పనులు అప్పగించరాదని ఉత్తరప్రదేశ్ మాన్యువల్ చెప్తోంది. ఫలానా కులస్తులను మాత్రమే పారిశుద్ధ్య పనికి వినియోగించాలనీ, కిందిస్థాయి కులాలవారు వండిన ఆహారాన్ని ఆధిపత్య కులాల ఖైదీలు నిరాకరించవచ్చనీ మరో మాన్యువల్ ప్రవచిస్తోంది. వివక్ష వెనక కుల,మత విశ్వాసాలుంటే పట్టించుకోరాదని బెంగాల్ మాన్యువల్ సుద్దులు చెబుతోంది. ఇవన్నీ చూస్తే జైళ్లలో మనకు తెలియని, మన రాజ్యాంగాన్ని అపహాస్యం చేసే మరో సమాంతర వ్యవస్థ అమల వుతున్నదని అర్థమవుతుంది. ఒక సమాజ నాగరికత స్థాయిని అక్కడి జైలుని చూసి చెప్పవచ్చని విఖ్యాత రచయిత దాస్తోవిస్కీ అన్నాడు. ఇన్ని దశాబ్దాలుగా మన మధ్యే కొనసాగుతూ వచ్చిన ఈ అధమస్థాయి వ్యవస్థ మూడు నెలల్లోపు కాదు, తక్షణం రద్దు కావాలని మానవీయతగల ప్రతి ఒక్కరూ కోరుకుంటారు.

# దర్యాప్తు దారులపై దర్యాప్తు




ఎన్నికల బాండ్ల వ్యవహారంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పలువురు బీజేపీ జాతీయ, కర్నాటక రాష్ట్ర సీనియర్ నేతలపై బెంగళూరులో ఇటీవల నమోదైన కేసు బీజేపీ వ్యవస్థీకృత అవినీతికి మచ్చుతునక. నిర్మలమ్మ అధికార దుర్వినియోగానికి పాల్పడి ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి.)తో పారిశ్రామికవేత్తలను బెదిరించి ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి నిధులు సమకూర్చారన్నది అభియోగం. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ కేసు నమోదు వెనుక జనధికార సంఘర్ష పరిషత్కు చెందిన ఆదర్శ్ ఆర్ అయ్యర్ మడమ తిప్పని పోరాటం చెప్పుకోతగ్గది. ఈ ఏడాది మార్చి 30న తిలక్నగర్ పోలీసులను ఆయన ఆశ్రయించగా పట్టించుకోలేదు. బెంగళూరు సౌత్ డిసిపి దగ్గరకెళ్లినా ఫలితం లేదు. దాంతో ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసుల కోసం కర్నాటకలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానంలో ఏప్రిల్లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు శుక్రవారం ఆదేశించిచడంతో అదే తిలక్నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేయాల్సి వచ్చింది. కేసులో మొదటి నిందితులు (ఎ1) నిర్మలా సీతారామన్ కాగా ఎ2 ఇ.డి, ఎ3 బీజేపీ కేంద్ర పదాధికారులు, ఎ4 బీజేపీ కర్నాటక రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నళిన్కుమార్ కటీల్, ఎ5 ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బివై విజయేంద్ర, ఎ6 రాష్ట్ర బీజేపీ పదాధికారులు. నిందితుల జాబితాలో కేంద్రమంత్రి జెపి నడ్డా పేరు కూడా ఉందని బయటికొచ్చింది. కేంద్రంలో బీజేపీ పాలనలోకొచ్చాక కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయాలకు ఎంతగా బరితెగించి వాడుకుంటున్నారో చూస్తున్నాం. సిబిఐ, ఇడి వంటి వాటిని ప్రయోగించి ప్రత్యర్థి పార్టీల కీలక నాయకులను భయపెట్టి లొంగదీసుకునేందుకు ప్రయత్నించడం, దారికి రాని వారిపై కక్ష కట్టి మరీ వేధించడం, అక్రమ కేసులకు, అరెస్టులకు పాల్పడటం మోడీ ప్రభుత్వానికి నిత్యకృత్యమైపోయింది. అలాంటి నీతిబాహ్యమైన చర్యలతో పార్టీ నిధులనూ పోగేసుకుం టున్నారని తాజాగా బెంగళూరు కేసుతో ధ్రువపడింది. పారిశ్రామికవేత్తలపైనా, కార్పొరేట్ కంపెనీల అధిపతులపైనా, సిఇఓలు, మేనేజింగ్ డైరెక్టర్లు, టాప్ ఎగ్జిక్యూటివ్లపై ఇ.డి.తో దాడులు చేయించి, ఆస్తులు స్వాధీనం చేసుకొని, వివిధ పద్ధతుల్లో బెదిరించి, పార్టీ పేరిట ఎలక్టోరల్ బాండ్లను కొనిపించి రూ.8వేల కోట్లకుపైన లూటీ చేశారన్న ఫిర్యాదు దారుని అభియోగాలను చూస్తే బీజేపీ నైజమేంటో బోధపడుతుంది. ఈ దోపిడీకి కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఇ.డి.ని సాధనంగా ఉపయోగించారు. ఇది అధికార దుర్వినియోగం, క్విడ్ప్రోకో, రాజకీయ అవినీతి కాక ఇంకేమిటి బీజేపీ ప్రభుత్వం 2017లో ఎలక్టోరల్ బాండ్స్ స్కీం తెచ్చినప్పుడే విపక్షాలు సందేహించాయి. సీపీఐ(ఎం) మరికొన్ని పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, సమాచార హక్కు చట్ట ఉల్లంఘనేనని, క్విడ్ప్రోకోకు దారి తీస్తుందని సుప్రీంకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరి 15న ఆ స్కీంను రద్దు చేసింది. ఎలక్టోరల్ బాండ్ల వివరాలను వెబ్సైట్లో ప్రజలకు బహిర్గతం చేయాలని ఎన్నికల కమిషన్ను ఆదేశించింది. అయినప్పటికీ సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు వివరాలు బయట పెట్టకుండా ఉండేందుకు ఎస్బిఐని, ఇ.సిని మోడీ సర్కారు ఎంతగా ప్రభావితం చేసిందో యావత్ దేశం గమనించింది. బెంగళూరు కేసుతో ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు, ప్రతిపక్షాలు వ్యక్తపర్చిన భయాందోళనలు వాస్తవమేనని రూఢ అయింది. ఎస్బిఐ, ఇసి వివరాల మేరకు ఎలక్టోరల్ బాండ్ల అమ్మకాల ద్వారా రూ.16 వేల కోట్ల విరాళాలు పార్టీలకు అందితే వాటిలో సింహభాగం బీజేపీ గల్లాలో పడ్డాయి. దీన్నిబట్టే ఎలక్టోరల్ బాండ్లు ఎవరికి ఉపయోగపడ్డాయో అర్థమవుతుంది. పార్టీ నిధుల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం స్వతంత్ర భారతదేశంలో మోడీ ప్రభుత్వంలోనే చోటుచేసుకుంది. తమది నిఖార్సయిన అవినీతి రహిత సచ్ఛీల పార్టీ, ప్రభుత్వం అని డబ్బా కొట్టుకొనే బీజేపీ నేతలకు, మోడీకి బెంగళూరు కేసు తిరుగులేని సవాల్. ఎఫ్ఐఆర్తోనే అంతా అయిపోలేదు. నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి వాస్తవాలు వెలికితీసి అసలైన దోషులకు శిక్ష పడితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ.

# చైనాకు అమెరికా టారిఫ్‌ల రిస్క్



చైనా తయారీ వస్తువులపై అమెరికా అత్యధికంగా టారిఫ్స్(సుంకాలు) విధించడంతో భారత్ వంటి ఇతర దేశాల మార్కెట్ల వైపు చైనా దృష్టి కేంద్రీకరిస్తుందని వాణిజ్య వర్గాలు భావిస్తున్నాయి. దీంతో భారత్ మార్కెట్లలోకి చైనా నుంచి వివిధ వస్తువుల డంపింగ్ఎక్కువవుతుందని దేశంలోని పారిశ్రామిక ఉత్పత్తి దారులు ఆందోళన చెందుతున్నారు. చైనా తయారు చేసే సోలార్ ప్యానెల్స్, ఎలక్ట్రిక్ వాహనాలు, లిథియమ్ ఐయాన్ బ్యాటరీలు, సిరంజీలు, స్టీల్ వస్తువుల దిగుమతులపై అమెరికా భారీగా సుంకాలు విధించింది. సెప్టెంబర్ 27 నుంచి ఈ టారిఫ్ విధింపు అమలులోకి వచ్చింది. ఈ పరిస్థితి భారత మార్కెట్లకు సవాలుగా మారుతుంది. చైనాతో ఏయే వస్తువుల విషయంలో మార్కెట్‌తో తీవ్రంగా పోటీపడవలసి వస్తోందో ఆయా తయారీ వస్తువులతోనే ఇప్పుడు భారత్ గట్టిగా పోటీపడక తప్పదు. ఈ పరిస్థితుల్లో మన కేంద్ర ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వశాఖ కూడా చైనా డంపింగ్‌ను నివారించడానికి బేసిక్ కస్టమ్స్ డ్యూటీని వంద శాతం పెంచాలని ఆకాంక్షిస్తోంది. దీని వల్ల ప్రస్తుత కస్టమ్స్ డ్యూటీ 7.5% నుంచి 15 శాతానికి పెరుగుతుంది. చైనా నుంచి నౌకల ద్వారా భారత్‌కు అయ్యే దిగుమతుల్లో 33% స్టీల్ వస్తువులేనని ఉక్కు మంత్రిత్వశాఖ తన సమీక్షలో నిర్ధారించింది. అమెరికా వంటి ఐరోపా యూనియన్ దేశాల్లో ఏ విధంగా చైనా వస్తువులపై టారిఫ్‌లు విధించారో మన దేశంలో కూడా ఆ విధానాన్నే అమలులోకి తీసుకురావాలని ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఉక్కు మంత్రిత్వశాఖ సిఫారసు చేసింది. చైనా నుంచి స్టీల్ అత్యధికంగా డంపింగ్ అవుతోందని ఉక్కు మంత్రిత్వశాఖ మొట్టమొదటిసారి గుర్తించింది. ఈ డంపింగ్ వల్ల స్వదేశీ పరిశ్రమలు గడ్డుపరిస్థితిని ఎదుర్కొంటాయని పారిశ్రామిక వర్గాలు ఆందోళన చెందడంతో ప్రభుత్వం టారిఫ్‌లను అత్యధికంగా చైనా వస్తువులపై విధించడానికి సన్నద్ధమవుతోంది. చైనా చవకగా ఉత్పత్తులను భారత్ మార్కెట్‌కు డంపింగ్ చేయడం గత కొన్నేళ్లుగా పరిపాటిగా వస్తోంది. ఇప్పుడు అమెరికా టారిఫ్‌ల భారంతో డంపింగ్ ఇంకా ఎక్కువ కావచ్చు. ఈ పరిస్థితుల్లో చైనా నుంచి భారీగా డంపింగ్ అయ్యే ఉత్పత్తులను రోజువారీ పర్యవేక్షించడానికి వాణిజ్య విభాగంలో 'వార్ రూమ్'ను ఏర్పాటు చేయడం అవసరమని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చి ఇనీషియేటివ్ సంస్థాపకులు అజయ్ శ్రీ వాస్తవ సూచించారు. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సందర్భంగా బైడెన్ ప్రభుత్వం చైనా ఉత్పత్తులపై బిలియన్ల డాలర్ల టారిఫ్‌లను విధించింది. ఈ టారిఫ్‌ల భారం 7.5% నుంచి 100% స్థాయికి అమాంతంగా పెరిగిపోయింది. అయితే చైనా లేదా మరే దేశం నుంచైనా ఉత్పత్తుల డంపింగ్‌ను నియంత్రించడానికి మన దేశంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డిజిటిఆర్)వ్యవస్థ ఉందని కేంద్ర ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. ఒకవేళ ఎవరైనా తమ వస్తువులను డంపింగ్ చేయాలనుకుంటే దీన్ని పరిశీలించడానికి వ్యవస్థాపరమైన యంత్రాంగం ఉందని తెలిపారు. చైనా ఇప్పటికే స్టీల్‌ను భారత్‌కు అత్యధికంగా డంపింగ్ చేస్తోందని, ఇప్పుడు అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో ఈ డంపింగ్ మరింత అత్యధిక స్థాయిలో జరగవచ్చని ఇండియన్ స్టీల్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ అలోక్ సహాయ్ పేర్కొన్నారు. గత ఏడాది చైనా నుంచి భారత్‌కు స్టీల్ ఉత్పత్తుల దిగుమతులు 91% వరకు పెరిగాయి. అదే విధమైన ట్రెండ్ ఈ ఏడాది కూడా కొనసాగుతుందని అలోక్ సహాయ్ సూచించారు. ఈ ఏడాది స్టీల్‌ను వినియోగించే దేశాలన్నీ చైనా స్టీల్‌కు ఆంక్షలు విధించాయి. భారత్ వంటి కొన్ని దేశాల్లో మాత్రం అలాంటి ఆంక్షలు అంతగా లేవు. అందుకనే భారత్‌కు ఎగుమతులపై ఎక్కువగా చైనా దృష్టి కేంద్రీకరిస్తోంది. భారత్ లో యాంటీ డంపింగ్ డ్యూటీ విధించడం అన్నది సుదీర్ఘ కాల ప్రక్రియ. ఇదే విషయమై వాణిజ్య ప్రతినిధులు ప్రభుత్వంతో చర్చిస్తున్నారు. గత ఆగస్టు డేటా ప్రకారం చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 22.4 శాతం వరకు అంటే 1 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు తగ్గిపోగా, చైనా నుంచి దిగుమతులు మాత్రం 1 అంటే 10.8 బిలియన్ డాలర్ల వరకు పెరిగాయ5.5 శాతంని డేటా వెల్లడించింది. దీన్ని బట్టి చైనాపై భారత్ ఆధారపడడం కొనసాగుతూనే ఉందని చెప్పవచ్చు. ఎలెక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్యానెల్స్‌పై టారిఫ్‌లు అమెరికా పెంచడం భారత్ వంటి దేశాలకు ఏ మాత్రం ప్రయోజనం కలగదని సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ రీసెర్చి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డి.ధనురాజ్ అభిప్రాయం వెలిబుచ్చారు.